చెత్త ఎత్తలేరు.. రోడ్డు వేయలేరు..!





- అధికారాలు లేని సర్పంచులు..
- అభివృద్ధికి దూరంగా పంచాయతీలు..
- కేంద్ర నిధులను దారి మళ్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఉత్సవ విగ్రహాలుగానే...

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఒంటి మీద తెలతెలా మెరిసే ఖద్దరు గుడ్డలు.. మెడలో పులిగోరు.. కాళ్లకు కిర్రుచెప్పులు.. ఎండపడకుండా పక్కన చేతిలో గొడుకు పట్టుకుని ఒక నౌకరు.. ఊరిలో నడుస్తుంటే ఎదురుపడ్డోళ్లంతా నమస్కారాలు.. గ్రామానికి ఏ ఆఫీసర్ వచ్చినా ముందుగా ఈయన్ను కలవాల్సిందే. గ్రామంలో కాలువల్లో చెత్త ఎత్తాలన్నా.. ప్రజలకు నీటి సౌకర్యం కల్పించాలన్నా.. రోడ్లు వేయాలన్నా.. ఈయన చేతుల్లోనే.. ఇదీ సాధారణంగా పాతకాలపు సినిమాలలో గ్రామ సర్పంచు అంటే కనిపించే దృశ్యం.. సినిమాల సంగతి అటుంచి.. మామూలుగా చూసినా.. సర్పంచ్ అంటే.. పైన చెప్పుకున్నట్లుగానే ఉంటుంది. సాధారణంగా దేశానికి రాష్ట్రపతి ఎట్లనో.? గ్రామానికి సర్పంచు అట్లా.. గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలో వైఎస్ జగన్ పాలన పుణ్యమా అని సర్పంచులకు ఎటువంటి అధికారం ఉండడం లేదు. వైసీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టానికి నిస్సిగ్గుగా తూట్లు పొడుస్తుండడంతో సర్పంచ్‌గా ఎన్నికై గ్రామాలను అభివృద్ధిపథంలో పరుగులు పెట్టిద్దామనుకున్న పలువురు రాజకీయాల్లోకి ఎందుకొచ్చాముర..? దేవుడా అని ఆవేదన చెందుతున్నారు. దీంతో గత ఐదేళ్లలో జిల్లాలో గ్రామ పంచాయతీలు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు గ్రామంలోని విద్యుత్ దీపాలకు కరెంటు బిల్లులకే సరిపోతోంది. ఒక వేళ గ్రామంలో వసూలయ్యే పలు రకాల పన్నులు సైతం సర్పంచులు స్వయంగా గ్రామ అభివృద్ధికి ఖర్చు చేసే అవకాశం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లిస్తోంది. రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 14, 15 ఆర్థిక సంఘం ద్వారా పంపిన 8629 కోట్ల రూపాయలను ప్రభుత్వం దారి మళ్లించింది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కనీసం రూపాయి కూడా నిధులు కేటాయించలేదు. దీంతో సర్పంచులు స్వయంగా కనీసం గ్రామంలో పిడికెడైనా చెత్త ఎత్తలేక.. జానెడు రోడ్లు వేయలేక కేవలం ఉత్సవ విగ్రహాలుగా మిగిలి పోతున్నారు.

రాష్ట్రం రూపాయి కూడా ఇవ్వలేదు..



మేం అధికారం చేపట్టి రెండున్నరేళ్లు అయింది. పంచాయతీలో డబ్బులు లేక ప్రజలు కోరినట్లు ఎక్కడా అభివృద్ధి చేయలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.15 లక్షలు రాగా, అందులో రూ.7 లక్షలు కరెంటు బిల్లులే చెల్లించాము. గతంలో పంచాయతీ ఖాతాలో ఉన్న డబ్బులు కూడా జగన్ ప్రభుత్వం తీసేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఒక రూపాయి కూడా పంచాయతీలకు కేటాయించలేదు. గతంలో పనిచేసిన సర్పంచులు.. ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిని చూసి నవ్వుతున్నారు. మా హయాంలోనే ఇవన్నీ చేశామని వాళ్లు చెబుతుంటే చెప్పుకోవడానికి మేం చేసింది ఏమీ లేక తలదించుకోవాల్సి వస్తోంది.

- పి.పాపులమ్మ, సర్పంచ్, నిమ్మనపల్లె

అనుకున్నదొకటి.. అయిందొకటి..



సర్పంచ్ అంటే గ్రామానికి పెద్ద. అభివృద్ధి, సంక్షేమం అన్నీ సర్పంచు ఆధ్వర్యంలో జరుగుతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలి. ఎప్పటిలాగే ఈసారి కూడా విధులు, నిధులు, బాధ్యతలు ఉంటాయనే ఉత్సాహంతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సర్పంచుగా గెలిచాము. సర్పంచుల అధికారాలకు రాష్ట్ర ప్రభుత్వం కత్తెర వేసింది. అదే సమయంలో పంచాయతీలకు రావాల్సిన నిధులను విడుదల చేయకపోగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను కూడా దారి మళ్లించింది. దీంతో గ్రామాల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టలేకపోయాను. ఎంపీ నిధులు, మండల, జడ్పీ నిధులతో అక్కడక్కడా కొంత మేర పనులు చేశా. చాలా పల్లెల్లో సిమెంటు రోడ్లు, మురికినీటి కాలువలు నిర్మించలేకపోయాం. ప్రజలు కోరుకున్న స్థాయిలో పంచాయతీ పాలన అందించలేకపోయామనే బాధ ఉంది.

- పట్టెం బుడ్డన్న, సర్పంచ్, దుబ్బిగానిపల్లె, మదనపల్లె మండలం


నిధులు లేవు, అభివృద్ధి లేదు..



నాలుగున్నరేళ్లుగా వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదు. అభివృద్ధి లేదు. దుద్యాల గ్రామంలో ఏ పల్లెలో చూసినా సమస్యలు తాండవిస్తున్నాయి. సొంత డబ్బులు పెట్టి ఎంతో కొంత ప్రజల అవసరాలు తీరుస్తున్నాం. పల్లెల్లో తాగునీటి బోర్ల మరమ్మత్తులకూ కష్టాలు తప్పడం లేదు. ప్రజలకు సేవ చేద్దామని రాజకీయాల్లోకి వచ్చాం. తొలిసారిగా రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు ఏదో చేద్దామనుకుంటే ఈ ప్రభుత్వంలో ఏమీ చేయలేకున్నాం. 14, 15వ ఫైనాన్స్ నిధులు కూడా ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ప్రభుత్వం నిధులు ఎప్పుడు ఇస్తుందో తెలియదు. అంతవరకు ప్రజల సమస్యలు తీర్చడం మా బాధ్యతగా భావిస్తున్నాం. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. అభివృద్ధి పనులు చేద్దామంటే డబ్బులు లేవు. సర్పంచ్‌కు అధికారమే లేకుండా పోయింది.

- ఎద్దుల లక్ష్మిదేవి, సర్పంచ్ దుద్యాల గ్రామం, సంబేపల్లె

పంచాయతీలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం..



వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకపోవడమే కాక కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను కూడా దారి మళ్లిస్తోంది. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం నిర్వాహకం వల్ల గ్రామాలలో ఎలాంటి అభివృద్ధి పనులను చేపట్టలేకపోతున్నాము. కనీసం తాగునీటి బోర్లకు మరమ్మతులను కూడా చేయలేకుండా పోతున్నాము. ఈ ప్రభుత్వం సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. గతంలో కూడా నేను సర్పంచ్‌గానూ, ఎంపీటీసీగానూ పనిచేశా. గతంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పంచాయతీల నిధుల్లో కానీ, అభివృద్ధిలో కానీ జోక్యం చేసుకోలేదు.

- పార్థసారథిరెడ్డి, సర్పంచ్, పూలుకుంట

ప్రభుత్వ నిధులు లేక నీరసించి..



పంచాయతీలు నిధులు లేక నీరసించిపోతున్నాయి. స్థానికంగా వనరులు సమకూర్చుకోలేని పంచాయతీలు చాలానే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో పంచాయతీలు దివాలా తీసే స్థాయికి వెళ్లాయి. ఎక్కడా అభివృద్ధి లేదు. చేద్దామంటే స్థానికంగా నిధులు ఉండవు. సాధారణంగా పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోగా, కేంద్రం ఇచ్చే నిధులను కూడా తన ఖాతాలోకి మళ్లించి, ఇతర వాటికి ఖర్చు చేసింది. పంచాయతీలో వచ్చే అరకొర నిధులతో ఉన్న కాడికి నెట్టుకొస్తున్నాం. ఎంపీ, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు నిధులు రూపాయి కూడా కేటాయించలేదు. కాలువలు కట్టలేదు. రోడ్లు వేయలేదు. ముఖ్యంగా టీడీపీ మద్దతుదారులు, అధికార పార్టీ రెబల్ సర్పంచులు గెలిచిన పంచాయతీల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మురుగు కాలువలు నిర్మించలేదు. తాగునీటి సమస్యలు పరిష్కరించలేని దుస్థితిలో సర్పంచులు ఉన్నారు. భవిష్యత్తులో పంచాయతీలకు మంచి రోజులు వస్తాయని ఆశిస్తున్నాం.

- మండ్యెం ప్రభాకర్, సర్పంచ్, చీకలబైలు పంచాయతీ, మదనపల్లె



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

స్వేచ్ఛాయుత ఎన్నికలకు కలిసి పనిచేద్దాం

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 8: నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు కలిసి పనిచేద్దామని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ అంశంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త జిల్లాలో తొలిసారిగా జరుగుతున్న ఎన్నికలకు అందరి సహకారం ఉండాలన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనలను పాటించి నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించడంలో కలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించినప్పుడు జిల్లాలో 12,58,165 మంది ఓటర్లు ఉన్నారు. జనవరి 22న తుది జాబితాను ప్రచురించినప్పుడు 14,02,808 మంది ఓటర్లు నమోదయ్యారన్నారు. ఇందులో 38,309 మందిని తొలగించామని, తుది ఓటరు జాబితా ప్రచురణ అనంతరం సుమారు 16 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటన్నింటినీ త్వరగా పరిశీలన పూర్తి చేసి పరిష్కరించాలని నియోజకవర్గ ఈఆర్‌వోలను ఆదేశించినట్లు తెలిపారు. చేర్పులు, తొలగింపులు, సవరణలతో ఓటరు జాబితాను స్వచ్ఛీకరించడంలో జిల్లా యంత్రాంగం మొత్తం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలు కూడా భాగస్వామ్యం కావాలని, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను రాతపూర్వకంగా ఇవ్వాలని, జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను కూడా రాతపూర్వకంగా అందజేయాలని రాజకీయ పార్టీలను కలెక్టర్ కోరారు. సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్, అదనపు బలగాలు ఉంటాయని, ప్రతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రంలో జరిగే పోలింగ్ సరళిని సీసీ కెమెరా వెబ్ కాస్టింగ్ విధానంలో రాష్ట్ర ఎన్నికల సంఘం స్వయంగా పర్యవేక్షణ చేస్తుందని తెలిపారు. తుది జాబితా ప్రచురణ అనంతరం ఒకే ప్రాంతం నుంచి ఎక్కువ తొలగింపులు వస్తున్నాయని, ఒకే వ్యక్తి పేరుతో రెండు, మూడు చోట్ల ఓట్లు ఉన్నాయని, అలాగే డూప్లికేట్, డబుల్ ఓట్లు ఉన్నాయని వాటన్నింటినీ సరిచేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. అలాంటి వాటిపై స్పష్టమైన ఆధారాలతో రాత మూలకంగా అందజేస్తే పరిశీలించి వాటిని సరి చేయడానికి తప్పనిసరిగా కృషి చేస్తామని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట, మదనపల్లె ఆర్డీవోలు రంగస్వామి, మోహన్‌రావు, హరిప్రసాద్, ఈఆర్‌వోలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు



ముద్దాయి పవన్‌కుమార్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 8: అక్రమ సంపాదనకు అలవాటుపడ్డ గుడిటి పవన్‌కుమార్ అనే యువకుడు రామాంజులురెడ్డి అనే వ్యక్తిని అత్యంత క్రూరంగా హత్య చేసిన కేసులో ముద్దాయికి జీవిత ఖైదు విధిస్తూ గురువారం రాయచోటి కోర్టు జిల్లా 5వ అదనపు జడ్జి కృష్ణన్ కుట్టి తీర్పు ఇచ్చారు. రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుండుపల్లె మండలం కొండలతూర్పుకు చెందిన చిన్నరెడ్డిగారి రామాంజుల్‌రెడ్డి, అతడి భార్య మనోహరి గత ఏడాది జూన్ 16వ తేదీ రాత్రి వారి పొలం వద్ద ఆవుల షెడ్డులో నిద్రిస్తుండగా రాత్రి 11 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన వెంకట్రమణ కుమారుడు గుడిటి పవన్‌కుమార్ డబ్బు, బంగారం కోసం వారి కళ్లలో కారం పొడి చల్లి కొడవలితో రామాంజుల్‌రెడ్డిని విచక్షణారహితంగా మెడపై నరికి చంపడమే కాకుండా అతడి భార్య మనోహరిపై కూడా దాడి చేసి గాయపర్చి అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ సంఘటనపై అప్పట్లో రాయచోటి రూరల్ సీఐ లింగప్ప ఆధ్వర్యంలో అప్పటి సుండుపల్లె ఎస్ఐ రామకృష్ణారెడ్డి కేసు నమోదు చేసి ముద్దాయి గుడిటి పవన్‌కుమార్‌ను అరెస్టు చేసి 302, 307 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్‌మోహన్‌రెడ్డి కేసును వాదించారు. కేసు పూర్వాపరాలను విచారించిన జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్ కుట్టి నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవిత ఖైదుతో పాటు రూ.4 వేలు జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించినట్లు రాయచోటి రూరల్ సీఐ తెలియజేశారు. అయితే జీవిత ఖైదు పడ్డ ముద్దాయి పవన్‌కుమార్ పై ఇంకా కొన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు సుండుపల్లె పోలీసులు తెలిపారు.

కురబలకోట మండలంలో ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా కబ్జా అవుతున్నాయి. వీటిని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు కళ్లు మూసుకుకూర్చున్నారు. అధికార పార్టీ నేతలు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అవతారమెత్తి అయిన కాడికి అమ్మేస్తున్నారు. వారిని ఏమీ చేయలేని స్థితిలో..అడ్డుకోవడం కంటే..వారితో కలసిపోవడమే మేలనుకున్నట్లుంది అధికారుల పరిస్థితి. అంతే పట్టపగలే జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి అప్పటికప్పుడే నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది కనీసం వాటిని ఆపే ప్రయత్నం కూడా చేయడం లేదనే విమర్శలున్నాయి. దీంతో అధికార పార్టీ నేతలు, గ్రామస్థాయి చోటా నాయకులు అయిన కాడికి అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు వీటిని అడ్డుకోకుండా పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు అధికంగా ఉన్నాయి. రెవెన్యూ అధికారులను పక్కన పెడితే, జాతీయ రహదారిపై నిత్యం ప్రయాణించే ఉన్నతాధికారులకు ఇవి కనిపించడం లేదా? అనే అనుమానం కలుగుతోంది.



నాయకులు అమ్మిన విలువైన ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు

హైవే పక్కన అమ్మేస్తున్నారు..!

- అడిగేవారు లేక..ఆపే ధైర్యం చేయక..
- నేతలకు మేతగా ప్రభుత్వ స్థలాలు
- నాయకులు, అధికారులు సమష్టిగా..
- కురబలకోటలో యథేచ్ఛగా ఆక్రమణలు



మదనపల్లె-అంగళ్లు జాతీయ రహదారి పక్కన ఉన్న విలువైన ప్రభుత్వ భూమి

మదనపల్లె, ఫిబ్రవరి 8: మదనపల్లె శివారు ప్రాంతం అమ్మచెరువుమిట్ట నుంచి కురబలకోట మండలం అంగళ్లు ప్రాంతం ఇంచుమించు కలిసిపోయింది. ములకలచెరువు నుంచి మదనపల్లె, రాయచోటి నుంచి మదనపల్లె వరకూ రెండు జాతీయ రహదారుల కలయిక కూడా అంగళ్లే. ఈ రెండు ప్రాంతాలను కలుపుతూ వెళ్తున్న జాతీయ రహదారికి ఆనుకుని, కలసిపోయిన స్థలాలే ప్రస్తుతం ఆక్రమణ, కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. ఇందులో అంగళ్లలోని ఓ కళాశాలకు సమీపంలోని అంగళ్లు రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు-118లో 28 సెంట్లు ప్రభుత్వ స్థలం ఉంది. రెవెన్యూ రికార్డుల్లో అది రస్తా పొరంబోకుగా నమోదైంది. ఇటీవల సర్వే నిర్వహించి రస్తా పోరంబోకుగా అధికారులు నిర్ధారించారు. అయితే ఈ స్థలాన్ని కురబలకోట మండల స్థాయి ఓ ప్రజాప్రతినిధి ఆక్రమించాడు. దీనిని ప్లాట్లుగా విభజించి ఒక్కొక్కటి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు అమ్మేసి సొమ్ము చేసుకున్నాడు. కొన్నవారు ఇందులో నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారులు నిర్మాణాన్ని ఇదివరకే అడ్డుకోవడంతో ఆ ప్రజాప్రతినిధిని నమ్మి నిలువునా మోసపోయామని బాధితులు లబోదిబోమంటున్నట్లు సమాచారం. ఈ ప్రాంతాన్ని ఆనుకునే గతంలో పేదలకు కాలనీ ఇచ్చారు. కాలనీకి పోనూ మిగిలిన స్థలం అలాగే ఉంది. దీనిని గమనించిన ఆ ప్రజాప్రతినిధి, రాజకీయ నాయకులు ఆ స్థలాన్ని అమ్మేశారు. తర్వాత గతంలో ఎప్పుడో పట్టాలు ఇచ్చినట్లు నకిలీలు సృష్టించినట్లు చెబుతున్నారు. స్థలం విక్రయ, నిర్మాణదారులు వీటిని తెరపైకి తేగా రెవెన్యూ అధికారులు వీటిని బోగస్ పట్టాలుగా చెబుతున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో ఇది ప్రభుత్వ భూమి అని, ఇందులో ఎవరూ ప్రవేశించరాదనే హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడానికి వెళ్లగా మండల స్థాయి ప్రజాప్రతినిధి అడ్డుకున్నట్లు చెబుతున్నారు. ఇక రెవెన్యూ సిబ్బంది చేసేది లేక బోర్డును తెచ్చి రెవెన్యూ కార్యాలయంలో పడేశారు. కొన్ని రోజులు నిర్మాణాలు ఆపేసి తర్వాత పనిచేసుకోండని, గతంలో ఇక్కడ పనిచేసిన అధికారి వారికి అభయం ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో రూ.లక్షల చేతులు మారినట్లు ఆరోపిస్తున్నారు. మండలంలోని ముదివేడు క్రాస్‌లోనూ ఇలాంటి పరిస్థితే ఉంది.

మదనపల్లె శివారు ప్రాంతం అమ్మచెరువుమిట్టకు సరిహద్దులో కురబలకోట మండలం తెట్టు రెవెన్యూ పరిధిలోని డీకేటీ భూములు ఉన్నాయి. అటు మదనపల్లె, ఇటు కురబలకోట సరిహద్దు ప్రాంతాలైన ఇక్కడి భూమి, స్థలాలకు మంచి గిరాకీ ఉంది. తెట్టు రెవెన్యూ గ్రామం పరిధిలోకి వచ్చే గుట్టను చదును చేసి ప్లాట్లు వేసి స్థలాలు విక్రయిస్తున్నారు. అలాగే దీనికి దిగువభాగాన గత టీడీపీ ప్రభుత్వంలో కురబలకోట మండలంలోని పేదలకు పట్టాలు మంజూరు చేశారు. ఇందులో కొందరు ఇళ్లు నిర్మించుకోగా, వివిధ కారణాలతో మరికొన్ని ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఆ స్థలాలను కూడా గ్రామస్థాయి నాయకులు అమ్మేస్తున్నట్లు చెబుతున్నారు. దానికి దిగువ భాగంలోనే మదనపల్లె-ములకలచెరువు జాతీయ రహదారి వెళుతోంది. రహదారిని విస్తరించే క్రమంలో ఆనుకుని ఉన్న విలువైన ప్రభుత్వ స్థలాన్ని అమ్మేస్తున్నారు. కొనుగోలుదారులు వెంటనే నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే వీరిని ఎవరూ అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు. ఇటు జాతీయ రహదారి నుంచి అటు పైభాగంలోని గుట్ట వరకూ ప్లాట్లు వేసి అయిన కాడికి అమ్మేస్తున్నారు. స్థానికులతో పాటు ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే దాడులు, దౌర్జన్యం చేస్తున్నట్లు తెలిసింది. దీంతో అధికారులు కూడా అక్కడికి వెళ్లే సాహసం చేయలేదని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ ఏరియాను బట్టి ప్లాటు రూ.5 లక్షల నుంచి రోడ్డు మార్గాన రూ.10 లక్షలకు విక్రయిస్తున్నారు. గతంలో ఇక్కడ పట్టాలు పొందిన బాధితులు అడ్డుకుంటే ఖాతరు చేయడం లేదు. అధికారులు కూడా అక్కడికి వెళ్లకపోవడం, పైగా రాజకీయ పెద్దల అండదండలు ఉండటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ స్థలాలు అమ్మడంతో పాటు వెంటనే నిర్మాణాలు చేపట్టాలని, అందుకు ప్రైవేటు వ్యక్తులను పహారాగా పెట్టినట్లు చెబుతున్నారు.

వీఆర్వోలను పంపించి పరిశీలిస్తాం..

ప్రభుత్వ భూములను ఆక్రమించి చేస్తున్న పనులు ఎక్కడ జరుగుతున్నాయో నా దృష్టికి రాలేదు. వెంటనే ఆయా గ్రామ రెవెన్యూ అధికారులతో మాట్లాడతాను. అక్రమంగా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడుతుంటే ఆపేసి చర్యలు తీసుకుంటాం.

- ఈశ్వరమ్మ, తహసీల్దార్, కురబలకోట



అమ్మచెరువుమిట్ట డౌన్‌లో జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు



కోసువారిపల్లె ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం

రారండోయ్.. వేడుక చూద్దాం..

- రేపటి నుంచి 19 వరకూ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు
- బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేసిన టీటీడీ అధికారులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 8: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వెంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. టీటీడీ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ 9న శుక్రవారం సాయంత్రం వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది. ఆదివారం ఉదయం నిర్వహించనున్న శేషవాహన సేవతో స్వామి వారి వాహన సేవలు ప్రారంభం కానున్నాయి. భక్తులు వాహన సేవలతో పాటు స్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా ఆలయం లోపల, వెలుపల టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ పరిసరాలను రంగురంగుల విద్యుద్దీప తోరణాలతో, స్వామి వారి విద్యుత్‌ద్దీప కటౌట్లతో శోభాయమానంగా అలంకరించారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలు ఇలా..

ఈనెల 9వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి అంకురార్పణతో ప్రసన్న వెంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 10న ఉదయం ధ్వజారోహణం, రాత్రి పల్లకీ ఉత్సవం, 11న ఉదయం శేష వాహనం, రాత్రికి హంస వాహనం, 12న ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి సింహ వాహనం, 13న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమంత వాహనం, 14న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం సేవలు ఉంటాయి. అలాగే 15న ఉదయం సర్వభూపాల వాహనం, రాత్రి 8 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, అనంతరం 10:30 గంటలకు గరుడ వాహన సేవ, 16న ఉదయం రథోత్సవం, రాత్రి గజ వాహనం, 17న ఉదయం పల్లకీ ఉత్సవము, రాత్రి అశ్వ వాహనంపై స్వామి వారు విహరించనున్నారు. 18న ఉదయం 8 నుంచి 9 గంటల నడుమ వసంతోత్సవం, 10:30 గంటలకు చక్రస్నానం, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణం, 19న ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 నుంచి 8 గంటల మధ్య పుష్పయాగంతో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని టీటీడీ అధికారులు తెలిపారు.



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన స్వామివారి విద్యుద్దీప కటౌట్లు

నిర్వహణకు నిధులేవీ..!

● చేతి నుంచి ఖర్చు చేస్తున్న ప్రధానోపాధ్యాయులు ● జిల్లా వ్యాప్తంగా ఇదే దుస్థితి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 8 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం నిర్వహణ నిధులను మంజూరు చేస్తుంది. విద్యాసంవత్సరం ముగింపునకు వస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకూ పాఠశాలల నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ జడ్పీ, మున్సిపల్ పాఠశాలల నిర్వహణకు ఆయా పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. ఆ నిధులను పాఠశాల కరెంటు బిల్లులు, స్టేషనరీ, మైనర్ రిపేర్లు, ఇతర అవసరాల కోసం ఖర్చు చేస్తారు. ప్రాథమిక పాఠశాలల్లో 20 మందిలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలకు


ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డు

రూ.10వేలు, 20 మందికంటే ఎక్కువ ఉంటే విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.5వేలు అదనంగా చెల్లిస్తారు. ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.15వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.25వేలు, ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే ఎక్కువ నిధులు విడుదల చేస్తారు. 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాల నిర్వహణ కోసం 40 శాతం నిధులు మాత్రమే మంజూరయ్యాయి. ఆ నిధులు కరెంటు బిల్లులు చెల్లించడానికి కూడా సరిపోవని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలకు కరెంటు బిల్లులు చెల్లించాలని విద్యుత్ శాఖాధికారులు ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రొద్దుటూరు మండలం విరాట్ నగర్ ప్రాథమిక పాఠశాలకు కరెంటు సౌకర్యం తొలగించడంతో ప్రధానోపాధ్యాయురాలు బకాయిలను చెల్లించి విద్యుత్‌ను పునరుద్ధరింపచేసుకున్నారు. లింగారెడ్డినగర్ పాఠశాలలో కరెంటు కట్ చేస్తామనడంతో నెలనెలా బిల్లులు చెల్లిస్తున్నారు. విద్యుత్ లేకపోతే మంచినీరు, మరుగుదొడ్లలో నీరు లేక విద్యార్థులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. దీంతో ప్రధానోపాధ్యాయులు నెలనెలా తమ జేబు నుంచి కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారు. నాడు-నేడు పనులు జరిగిన పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్, ఫ్యాన్లు, లైట్లు, టీవీలు, ప్యానెల్ బోర్డుల వినియోగంతో కరెంటు బిల్లులు ఎక్కువగా వస్తున్నాయి. విద్యుత్ శాఖ అధికారుల హెచ్చరికలను ప్రధానోపాధ్యాయులు ఎంఈఓల దృష్టికి తెచ్చినా సొంత డబ్బు చెల్లించాలని సూచించడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్పందించి పాఠశాలలు ప్రారంభమైన వెంటనే నిర్వహణ నిధులు మంజూరు చేయాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.


నాడు-నేడు పనులలో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్


పాఠశాలలో ఏర్పాటు చేసిన టీవీ

నిధులు విడుదల చేయాలి



పాఠశాల నిర్వహణకు ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం దారుణం. గ్రామీణ పాఠశాలల్లో బిల్లులు కట్టకపోతే విద్యుత్ సౌకర్యం తొలగిస్తామని విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. పాఠశాలల నిర్వహణకు ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బు వెచ్చిస్తున్నారు. సకాలంలో నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

\- రవీంద్రుడు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

జేబు నుంచి ఖర్చు చేస్తున్నారు



ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ప్రధానోపాధ్యాయులు తమ జేబు నుంచి డబ్బు ఖర్చు చేస్తున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉండే పాఠశాల నిర్వహణ ప్రధానోపాధ్యాయులకు భారంగా మారింది. ప్రభుత్వం పాఠశాలలు ప్రారంభమైన వెంటనే నిర్వహణ నిధులు మంజూరు చేయాలి.

\- సుబ్బరాజు యాదవ్, ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చెక్‌బౌన్స్ కేసుల్లో ఇరువురికి జైలుశిక్ష

నందలూరు, ఫిబ్రవరి 8: నందలూరు జ్యుడీషియల్ పరిధిలోని మూడు వేర్వేరు కేసులకు సంబంధించి జైలుశిక్ష, పరిహారం ఇచ్చేలా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.లత గురువారం తీర్పును వెలువరించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ, జెండామానువీధికి చెందిన అబ్దుల్ గని అనే వ్యక్తి షేక్ నజీర్ అహమ్మద్ వద్ద రూ.2,20,000 అప్పుగా తీసుకొని ఆ మొత్తానికి చెక్కును ఇచ్చారు. ఆ చెక్ బౌన్స్ కావడంతో 6 నెలల జైలుశిక్ష విధించడంతో పాటు చెక్కు విలువ మొత్తాన్ని షేక్ నజీర్ అహమ్మద్‌కు ఇవ్వాలని తీర్పు ఇచ్చారు. అదేవిధంగా మరో కేసులో పాటూరుకు చెందిన షేక్ అబ్దుల్ సత్తార్ వద్ద నుంచి నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన అబ్దుల్ గని రూ.6 లక్షలు అప్పుగా తీసుకుని ఆ మొత్తానికి చెక్కును అందజేశాడు. ఈ చెక్కు బౌన్స్ కావడంతో ఆ వ్యక్తి ఆరు నెలల జైలుశిక్ష విధించడంతో పాటు చెక్కు విలువ మొత్తాన్ని అబ్దుల్ సత్తార్‌కు చెల్లించాలని తీర్పు వెల్లడించారు. అదేవిధంగా డ్రంకెన్ డ్రైవ్‌లో నందలూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి ఒక వ్యక్తికి నాలుగు రోజుల సాధారణ జైలుశిక్షను విధిస్తూ జడ్జి లత తీర్పునిచ్చారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

చాపాడు, ఫిబ్రవరి 8: మండలంలోని రాజుపాళెం గ్రామంలో ఈనెల 7న బుధవారం లక్ష్మిదేవి (36) అనే మహిళ తన ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఆమెకు భర్త నాగేశ్వరరెడ్డి, కూతురు, కుమారుడు ఉన్నారు. లక్ష్మిదేవి తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య

సికెదిన్నె, ఫిబ్రవరి 8: అరుణ్‌కుమార్ (19) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలం బండూరు గ్రామానికి చెందిన గుండప్పగారి అమరేష్ కుమారుడు స్థానిక ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతూ స్థానిక ఊటుకూరులో గదిలో ఉండేవాడు. రూములో అయిదుగురు విద్యార్థులు ఉంటుండగా గురువారం మధ్యాహ్నం ఒక్కడే రూముకు వచ్చి ఉరి వేసుకున్నట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తండ్రిపై కొడుకులు, భార్య దాడి

రామాపురం, ఫిబ్రవరి 8: మండలంలోని గువ్వలచెరువులో ఈనెల 5న కుటుంబ సభ్యుల ఘర్షణలో తండ్రిపై కొడుకులు, భార్య దాడి చేయడంతో రెండు తొడ భాగాలు విరిగినట్లు బాధితుడు షేక్ షంషీర్‌బాషా కడప రిమ్స్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. చింతకొమ్మదిన్నె మండలం బోడెద్దులపల్లెకు చెందిన షేక్ షంషీర్‌బాషాకు రామాపురం మండలం గువ్వలచెరువుకు చెందిన హసీనాబేగంతో కొన్నేళ్లక్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు హనీఫ్, హుస్సేన్‌బాషాలు ఉన్నారని, ఆయన భార్య పిల్లలు గువ్వలచెరువులో కాపురం ఉన్నారని తెలిపారు. ఈనెల 5న గువ్వలచెరువుకు భార్య, పిల్లలు వద్దకు రాగానే వారు దాడి చేసి రెండు తొడలు విరగ్గొట్టడంతో తీవ్రగాయాలైనట్లు వివరించారు. స్థానికుల సాయంతో బాధితుడిని కడప రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ ఔట్‌పోస్టు పోలీసుల ద్వారా అందిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేపు జవహర్ నవోదయలో ప్రవేశ పరీక్ష

రాజంపేటటౌన్, ఫిబ్రవరి 8: రాజంపేట మండలం నారంరాజుపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో చేరేందుకు ఈనెల 10వ తేదీ ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిమితి సీట్ల కోసం ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని, 9వ తరగతి ప్రవేశానికి 956 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారని, అలాగే 11వ తరగతిలో పరిమిత సీట్లకై 434 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. 9వ తరగతి విద్యార్థులకు రాజంపేట పట్టణంలో 4 పరీక్షా కేంద్రాలను, 11వ తరగతి విద్యార్థులకు నవోదయ విద్యాలయంలో పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులందరూ నవోదయకు సంబంధించిన వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9494767721, 8096329332, 8309970824 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న రైతులు

● రైతులపై ఎస్‌ఐ ఆగ్రహం ● ఎస్‌ఐ తీరుపై ఆగ్రహించిన రైతులు, స్థానికులు


ఎస్‌ఐతో మాట్లాడుతున్న రైతులు

వీరబల్లి, ఫిబ్రవరి 8: మాండవ్యనదిలో ఇసుక రీచ్‌లకు అనుమతులు ఒకచోట ఉంటే మరోచోటి నుంచి ఇసుకను అక్రమంగా తరలించడానికి వచ్చిన ప్రైవేటు సంస్థ ప్రతినిధులను స్థానికులు, రైతులు గురువారం అడ్డుకున్నారు. వీరబల్లి సమీపంలో బొంగావాండ్లపల్లె వద్ద ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయడానికి వచ్చిన కంపెనీ ప్రతినిధులను రైతులు అడ్డుకుని అనుమతి లేకుండా ఇక్కడి నుంచి ఇసుక ఎలా తరలిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడికి వచ్చిన వీరబల్లి ఎస్‌ఐ చంద్రమోహన్ ఆ కంపెనీ వారికి అనుమతులు ఉన్నాయని, మీరెవరు అడ్డుకోవడానికి అని రైతులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి ఇసుక తరలిస్తే సమీప రైతుల బోర్లలో నీరు అడుగంటడంతో పాటు గ్రామాల్లోని తాగునీటి పథకాల్లో నీరు అడుగంటి నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. దీంతో మరింత రెచ్చిపోయిన ఎస్‌ఐ మాండవ్యనదిలో బోర్లు ఎవరు వేయమన్నారు.. మాండవ్యనదిని ఏమైనా రైతులకు రాయించారా అని రైతులతో ఇష్టానుసారంగా మాట్లాడడంతో పాటు ఇసుక తరలింపును ఎవరు అడ్డుకుంటారో చూస్తానని వారిపై చిందులేశారు. అనంతరం టీడీపీ నాయకులు టి.శ్రీధర్ రెడ్డి, తుమ్మల రమేశ్, ఆంజనేయులురెడ్డిలు సంఘటనా స్థలానికి వచ్చి ఇక్కడ రీచ్ పెట్టడానికి ఒప్పుకోమని ఖరాకండిగా చెప్పారు. వెంటనే అక్కడ ఉన్న కొందరు జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాజంపేట నియోజకవర్గ నాయకుడు మదన్‌రెడ్డిలకు ఇక్కడ జరిగిన విషయాన్ని ఫోన్ ద్వారా తెలిపారు. వెంటనే వారు కలెక్టర్‌కు, ఎస్పీలకు ఫోన్ చేసి అడగ్గా తాము అక్కడ ఇసుక రీచ్‌కు అనుమతులు ఇవ్వలేదని చెప్పారని అక్కడున్న రైతులు తెలిపారు.

బడ్జెట్‌లో అధికభాగం సీమ ప్రాజెక్టులకు కేటాయించాలి

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 8: ప్రాంతీయ అసమానతలు తొలగాలంటే సాగునీటి ప్రాజెక్టుల బడ్జెట్‌లో సింహభాగం రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐఎంఏ హాలులో చర్చా వేదిక నిర్వహించారు. శివశంకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి దశరథరామిరెడ్డి మాట్లాడారు. రాయలసీమ జిల్లాల అభివృద్ధికి సాగునీరు ఎంతో అవసరమని, ఆ దిశగా పాలకులు పనిచేయకపోవడం వల్లనే సీమ ప్రాంతం నేటికీ వెనుకబడే ఉందన్నారు.


చర్చావేదిక నుద్దేశించి మాట్లాడుతున్న దశరథరామిరెడ్డి

మధ్యాంధ్రలో 32 లక్షల ఎకరాల సాగు యోగ్యమైన భూమి ఉంటే అందులో 24 లక్షల ఎకరాలకు ప్రభుత్వాలు నీరు అందించాయన్నారు. రాయలసీమలో 90 లక్షల ఎకరాల వ్యవసాయ యోగ్యమైన భూమి ఉంటే కేవలం 8 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వడం సరైంది కాదన్నారు. 40 సంవత్సరాలుగా ఈ ప్రాంత సస్యశ్యామలం కోసం చేపట్టిన తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా, వెలుగోడు, ప్రాజెక్టులు ఏ దుస్థితిలో ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. మూడు టీఎంసీల నీరు సామర్థ్యం గల అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు గల సమస్యను 5 సంవత్సరాలైనా గాలికి వదిలేశారన్నారు.

సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, నాయకులు కె.ఆంజనేయులు, ఓబయ్య, దేవరశ్రీకృష్ణ, ఓపీడీఆర్ అనంతపురం జిల్లా నాయకులు శ్రీనివాసులు, శివశంకర్‌గౌడ్, జి.పుల్లారెడ్డి, పి.శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుంకన్న, గంగిరెడ్డి, రామకృష్ణారెడ్డితో పాటు పలువురు రైతు సంఘాల, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులు పరీక్షల భయాన్ని విడనాడాలి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 8 : పదో తరగతి విద్యార్థులు పరీక్షల పట్ల భయాన్ని విడనాడాలని సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కృషి, పట్టుదల, తపనతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. గురువారం కడప నగరం జయనగర్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి భావిభారత పౌరులుగా, సమాజ నిర్దేశకులుగా ఉన్నత స్థానాన్ని అధిరోహించడానికి చదువుతో పాటు సంస్కారం, ఆటలు, పాటలు మాటల్లో మంచి నైపుణ్యం పొందాలన్నారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో పరీక్షల ఫోబియాను వదిలిపెట్టి మంచి మార్కుల కోసం ప్రయత్నం చేయాలని చెప్పారు. ప్రతి విద్యార్థి లక్ష్యసాధన కోసం ప్రయత్నం చేస్తే సాధించలేనిది లేదని సాధించడానికి వ్యక్తిత్వాన్ని మనస్తత్వాన్ని అలవరచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యవతి, ఉపాధ్యాయులు రామాంజనేయరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సమగ్రశిక్ష పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

వెట్టిచాకిరీని నిర్మూలిద్దాం

కార్మిక శాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌నాయక్

కడప (చిన్నచౌకు), ఫిబ్రవరి 8 : వెట్టిచాకిరి చట్ట విరుద్ధమని కడప జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్ నాయక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిబ్రవరి 9న వెట్టిచాకిరి నిర్మూలన దినంగా ప్రకటించిందని తెలిపారు. ఇందులో భాగంగా వెట్టిచాకిరి నిర్మూలన చట్టంపై కార్మికులకు అవగాహన కలిగించేందుకు గురువారం కడప పాత రిమ్స్‌లో గల కార్మికశాఖ కార్యాలయంలో వెట్టిచాకిరికీ వ్యతిరేకంగా సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు వెట్టిచాకిరి పనిలో చిక్కుకుని కొట్టుమిట్టాడుతున్న వారిని రక్షించాలన్నారు. ఎలాంటి నేరాలు జరగకుండా నిర్మూలించేందుకు అందరితో కలిసి అవగాహన కల్పించాలన్నారు. వెట్టిచాకిరి నిర్మూలన చట్టం అమలు ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను వెట్టిచాకిరి రహిత రాష్ట్రంగా మార్చాలన్నారు. తద్వారా ప్రజలందరూ ఆరోగ్యంగా సంపన్నమైన జీవితం గడపగలరని తెలిపారు. ఎవరైనా వెట్టిచాకిరి వ్యవస్థలో చిక్కుకుని ఉంటే తమకు సమాచారం అందించాలని అటువంటి వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీకాంత్‌నాయక్

జనసేనలో చేరిన తుంగా రమణయ్య

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 8 : విజయవాడ జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో కడప విశ్వప్రగతి చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టరు, ప్రముఖ రియల్టర్ తుంగా రమణయ్య జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు. ఆయనకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, టీడీపీ-జనసేన బలపరిచిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. రమణయ్య మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి, అభ్యర్థుల విజయానికి కష్టపడి పనిచేస్తానని తెలిపారు.


తుంగా రమణయ్యకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్‌కళ్యాణ్

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడండి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 8: వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు రూపొందించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేలా తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. జగనన్న లేఅవుట్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై హౌసింగ్ పీడీతో సమీక్షించారు. ఇంకా ప్రారంభం కాని ఇళ్లు, బీబీఎల్ దశలో ఉన్న వాటిని బీఎల్ స్థాయికి తీసుకురావాలని ఇందుకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు తగిన ఆదేశాలు జారీ చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

టీడీపీ కార్యకర్తల జోలికొస్తే తాటతీస్తాం

● టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

సిద్దవటం/రాజంపేట, ఫిబ్రవరి 8: టీడీపీ కార్యకర్తల జోలికొస్తే తాటతీస్తామని టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు అన్నారు. మండలంలోని అరుంధతివాడలో గత రాత్రి టీడీపీ నేతలపై వైసీపీ నేతలు దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన దళిత కుటుంబాలను గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ దళిత నాయకులపై వైసీపీ నేతల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో టీడీపీ నేతలు దళిత నాయకులే లక్ష్యంగా వరుస దాడులకు దిగుతున్నారని విమర్శించారు. త్వరలోనే దాడులపై తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. దళిత నాయకుడు మధును పరామర్శించి దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పాలన చేత గాని వైసీపీకి ప్రజలందరూ దూరమవుతున్నారని, రాష్ట్రంలో అరాచకాన్ని సృష్టించి, రాష్ట్రాన్ని వినాశనం చేసిన తరువాత రాష్ట్రంలో ఉన్న అన్ని సామాజిక వర్గాల ప్రజలు వైసీపీకి మద్దతు తెలపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాచుపల్లి పిచ్చిరెడ్డి, శేఖర్‌రెడ్డి, ఒంటిమిట్ట శివారెడ్డి, యువనాయకులు హరినాథ్ రెడ్డి, నల్లగొండు గంగిరెడ్డి, రాచపల్లి చౌడయ్య, మైనార్టీ నాయకులు రంతు, మధు రమణా రెడ్డి రామిరెడ్డి, రాజా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎన్నికల కరపత్రంలా రాష్ట్ర బడ్జెట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో అంకెలను మసిపూసి మారేడు కాయ చేస్తోందని రాజంపేట టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకునేందుకు కొన్ని అంకెలు పెంచి బడ్జెట్‌లో చూపారన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.79 లక్షల కోట్లు ఉన్న బడ్జెట్ అంచనాలను వచ్చే ఆర్థిక సంవత్సరంలో 2.86 లక్షల కోట్లకు స్వల్పంగా పెంచారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుబ్బనరసయ్యనాయుడు, ఆర్.సతీష్‌రాజు, ఒంటిమిట్ట శివారెడ్డి, యువనాయకులు పరుశురాం నాయుడు, నల్లగొండు గంగిరెడ్డి, మైనార్టీ నాయకులు రంతు పాల్గొన్నారు.



దాడిలో గాయపడిన నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

నిధుల వినియోగంపై సమీక్షా సమావేశం

● డీపీవో ధనలక్ష్మి



సమీక్షా సమావేశంలో డీపీవో ధనలక్ష్మి

చిన్నమండెం, ఫిబ్రవరి 8: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి 15వ ఫైనాన్స్ పెండింగ్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామ పంచాయతీకి మంజూరైన నిధులు, వీధిలైట్లు, క్లాప్ మిత్ర జీతాలు ఖర్చు చేయాల్సిందిగా సూచించారు. వచ్చే మార్చి నెలాఖరుకు ఇంకో ఇన్‌స్టాల్‌మెంటు రిలీజ్ అవుతుందన్నారు. ఇంటి పన్నులు ఈ నెలాఖరుకు 90 శాతం వసూలు చేయాల్సిందిగా సూచించారు. అలాగే అన్ని అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఆర్‌పీ అస్రఫ్‌అలీ, ఈవోపీఆర్‌డీ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యంలో అప్రమత్తత అవసరం

● వార్డు కార్యదర్శులతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు



కార్యదర్శులతో సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 8: పట్టణ పారిశుధ్యం, ప్రజారోగ్యం కాపాడే విషయంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలని వార్డు శానిటేషన్ కార్యదర్శులను కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ విభాగంలో అధికారులు, సిబ్బందితో విషజ్వరాలు, పారిశుధ్య సమస్యపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ప్రజలు సీజనల్ వ్యాధుల భారిన పడకుండా పట్టణంలో దోమల నివారణకు స్ప్రే, మురుగునీటి నిల్వలలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేయించాలని ఆదేశించారు. అలాగే పట్టణ ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే విధంగా మున్సిపాల్టీల్లోని అన్ని వార్డుల్లో ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సమీక్షలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, వార్డు శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాయిలోకేశ్ సమక్షంలో పలువురు చేరిక



బీజేపీలో చేరిన పలువురితో సాయిలోకేశ్

చిన్నమండెం, ఫిబ్రవరి 8: మండలంలోని పడమటికోన గ్రామ పంచాయతీకి చెందిన మన్నెం బ్రదర్స్ తన అనుచర వర్గంతో కలిసి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ చేతుల మీదుగా బీజేపీ కండువా కప్పుకొని ఆ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్లస్టర్ ఇన్‌చార్జి దయాకర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోక్లస్టర్ ఇన్‌చార్జి చామంచి శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రమౌళి పాల్గొన్నారు. సాయిలోకేశ్ మాట్లాడుతూ మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. పార్టీలో చేరిన వారిలో వెంకట్రమణనాయుడు, పుల్లమనాయుడు, బాబునాయుడు, తిరుపతినాయుడు, పురుషోత్తంనాయుడు, అవినాశ్‌నాయుడు, అనుచర వర్గం పాల్గొన్నారు.

ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సంబేపల్లె, ఫిబ్రవరి 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎర్రగుంట్ల మిట్ట రాయచోటిలో 5వ తరగతి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ గురువారం తెలిపారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ గ్రూపులు ఉన్నాయని, ఫిబ్రవరి 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. రాత పరీక్ష మార్చి 10న ఆ కళాశాలలో హాల్లో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. 5వ తరగతి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు అన్నమయ్య జిల్లా పరిధిలోని పాఠశాలలో 4వ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఎటువంటి ఎంట్రీ ఫీజు చెల్లించవల్సిన అవసరం లేదన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు కళాశాల పని దినాల్లో సంప్రదించాలని తెలియజేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అనంతంపల్లె పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఆర్వో లీలారాణి

పుల్లంపేట, ఫిబ్రవరి 8: మండలంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం రైల్వేకోడూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పుల్లంపేట, రెడ్డిపల్లె, అనంతంపల్లె, అప్పయ్యరాజుపేట, జాగువారిపల్లె, అనంతరాజుపల్లె తదితర పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరాతీశారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, ర్యాంప్ తదితర వాటిని పరిశీలించడంతో పాటు ఓటర్ల సంఖ్యను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దారు నరసింహకుమార్, ఆర్‌ఐలు నవీన్, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక మంత్రి బడ్జెట్ అంతా అంకెల గారడీ

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విశ్వనాథనాయుడు ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న విశ్వనాథనాయుడు

రైల్వేకోడూరు,ఫిబ్రవరి8: ఆర్థిక మంత్రి బడ్జెట్ అంతా అంకెల గారడీగానే మిగిలిపోయిందని, అంచనాలు కొండంత.. ఖర్చులు గోరంత చూపారని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథ నాయుడు ధ్వజమెత్తారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియాతో ఆయన మాట్లాడుతూ ఏపీని అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని, పన్నుల బాదుడు తప్ప బడ్జెట్లో కొత్త అంశాలు ఏమీ లేవన్నారు. రిజిస్ట్రేషన్ ఛార్జీలను కూడా జగన్‌రెడ్డి ప్రభుత్వం పెంచిందని ఎద్దేవా చేశారు. పేరుకే బీసీ సంక్షేమం, సబ్‌ప్లాన్ నిధులన్నీ దారి మళ్లింపు చేస్తున్నారని విమర్శించారు. అంతేకాకుండా వైసీపీ ప్రభుత్వం ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచిందని, వివిధ రకాల సర్‌ఛార్జీల పేరుతో మరింతగా ఏపీ ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. జగనన్న విద్యా దీవెనలో ఏడు లక్షల మంది విద్యార్థులకు కోత విధించారన్నారు. వివిధ రకాల కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించినట్లు గొప్పలు చెప్పుకుని చివరకు వారు కూర్చోవడానికి కుర్చీలు కూడా లేకుండా చేసిందన్నారు. ఈ సమావేశంలో పుల్లంపేట మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్, రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పులేల రమేశ్‌బాబు, ఆర్‌డీఎస్ కో-ఆర్డినేటర్ నవీన్, క్లస్టర్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలి

రామాపురం, ఫిబ్రవరి 8: గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరించాలని గ్రామ సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో మాజీ ఎంపీపీ జనార్థన్‌రెడ్డి, ఎంపీడీవో ప్రభాకర్ అన్నారు. మండల ప్రజా పరిషత్ సభా భవనంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మార్కెట్ కమిటీ ఛైర్మన్ విశ్వనాథరెడ్డి, సీహెచ్‌వో ఇలియాస్, ఏఓ నాగమణి, ఏపీవో సురేంద్రరెడ్డిలు పలు సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకట్రమణ, మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూషణ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, తహసీల్దార్ అరవిందకిశోర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జనసేన తీర్థం పుచ్చుకున్న వెంకటసుబ్బయ్య



జనసేనాని సమక్షంలో పార్టీలో చేరుతున్న దృశ్యం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 8: నియోజకవర్గ దళిత సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు మద్దెల వెంకటసుబ్బయ్య గురువారం విజయవాడలోని జనసేన కార్యాలయంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలు, ఆశయాలు గొప్పగా ఉన్నాయని, అందువల్ల ఆయనతో కలిసి ప్రయాణం చేయాలనుకుని పార్టీ కండువా కప్పుకున్నానన్నారు. టీడీపీ, జనసేన మద్దతుతో రాష్ట్రంలో అధికారంలోకి రావాలని కోరుకుంటున్నామని తెలిపారు. రాబోవు ఎన్నికల్లో రైల్వేకోడూరులో ఎవరికి టిక్కెట్టు ఇచ్చినా వారి గెలుపునకు కృషి చేస్తామన్నారు. అందరిని కలుపుకుని పార్టీ మనుగడ కోసం ముమ్మరంగా ప్రచారం చేస్తామన్నారు. వైసీపీ అవినీతి పాలనకు ముగింపు చెప్పాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు.

పాఠశాల విద్య బలోపేతానికి కృషి : ఆర్జేడీ



ఆర్జేడీని సన్మానిస్తున్న డీఈవో, తదితరులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 8: పదోన్నతిపై ఆర్జేడీగా గురువారం బాధ్యతలు చేపట్టిన ఎద్దుల రాఘవరెడ్డిని అన్నమయ్య జిల్లా డీఈఓ శ్రీరామ్‌పురుషోత్తం, అన్నమయ్య, కడప జిల్లాల ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లు కొండూరు శ్రీనివాసరాజు, సుబ్బారెడ్డిలు గురువారం ఆర్జేడీ కార్యాలయంలో ఆయనను కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ పాఠశాల విద్య బలోపేతానికి ప్రభుత్వం ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టారని, సదరు అన్ని కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలయ్యేలా కృషి చేసి రాష్ట్రంలోనే ఈ జోన్‌ను ఉన్నత స్థానంలో నిలపాలని ఆకాంక్షిస్తున్నామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది రవీంద్ర, శ్రీధర్, ఏఈ రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

నిరుద్యోగుల చెవిలో పూలు : ఏబీవీపీ



చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలుపుతున్న దృశ్యం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 8: మెగా డీఎస్సీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి నిరుద్యోగుల చెవుల్లో పూలు పెడుతోందని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ జేపీ నాగిరెడ్డి అన్నారు. గురువారం ఏబీవీపీ రాయచోటిశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఎదుట ఏబీవీపీ కార్యకర్తలు వినూత్నంగా చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 27 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం కేవలం 6,100 పోస్టులకే నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయడంతో పాటు విద్యార్థులకు టెట్, డీఎస్సీ పరీక్షల తయారీకి సమయం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి ప్రశాంత్, విజయ్, వాస్తవ్, గణేశ్, త్యాగరాజు, శివమణి తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

వంకను ఆక్రమిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 8: రాయచోటి మండలం మాధవరం గ్రామంలోని కాటినేనివాండ్లపల్లెకు చెందిన ఓ వ్యక్తి వంకను ఆక్రమిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన గ్రామస్తులు గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి... మాధవరం గ్రామం సర్వే నెంబరు 1929/4లో 1.50 సెంట్ల భూమిని పాపయ్య కుమారుడు నాగయ్య పేరిట ఆన్‌లైన్ చేసుకుని చుట్టుపక్క ఉన్న రైతుల పొలాల్లోకి వెళ్లడానికి దారి లేకుండా ఎక్సకవేటర్‌తో చదును చేసి ఆక్రమిస్తున్నాడని ఫిర్యాదులో ఆరోపించారు. ఈ పొలానికి అనుకొని ఉన్న నల్లగుట్టను కూడా చదును చేసి దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని వారు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. వంక అనుకొని ఉన్న తమ పొలాలకు ప్రమాదం పొంచి ఉందని వారు తెలిపారు. ఈ విషయాలపై పూర్తిగా విచారించి చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్ స్పందిస్తూ పూర్తిగా విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్నికలకు సిద్ధం కండి : బీజేపీ

రైల్వేకోడూరు(రూరల్), ఫిబ్రవరి 8: ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ రాయలసీమ జోన్ క్లస్టర్ కో-ఆర్డినేటర్ సామంచి శ్రీనివాస్ తెలిపారు. గురువారం బీజేపీ కార్యాలయంలో అసెంబ్లీ కన్వీనర్ గడ్డం చంగల్‌రాజు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బీజేపీని బలోపేతం చేయాలని, బీజేపీ కేంద్రంలో మరోసారి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు మాట్లాడుతూ బీజేపీ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్ని ఆకట్టుకుంటున్నాయన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ మాట్లాడుతూ పార్టీని ముందుకు నడిపించాల్సి బాధ్యత కార్యకర్తలదే అని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు దాసరాజు జయప్రకాష్ నారాయణవర్మ, బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ చంద్రమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, అసెంబ్లీ కో-కన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర హార్టికల్చర్ మాజీ కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

నందలూరు, ఫిబ్రవరి 8: ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని రాజంపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, ఎస్ఐ మహమ్మద్ జహీర్‌లు పేర్కొన్నారు. 35వ జాతీయ భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం నందలూరు షాదీఖానాలో ఆటో డ్రైవర్లకు, సుమో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అంజిరెడ్డి, గణేష్, హోంగార్డు బి.వి.సుబ్బారెడ్డి, ఆటో, సుమో డ్రైవర్లు పాల్గొన్నారు.

సోమశిల వెనుక జలాల్లో 15.60 లక్షల చేప పిల్లలు

నందలూరు, ఫిబ్రవరి 8: మండలంలోని కోనాపురం గ్రామ సమీపంలోని సోమశిల వెనుక జలాల్లో గురువారం డీఎఫ్‌వోలు సుస్మిత, ఇరిగేషన్ ఈఈ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 15.60 లక్షల చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద 40 శాతం సబ్సిడీతో పలమనేరు, కృష్ణాపురం, చిత్తూరు జిల్లా, కళ్యాణదుర్గం, తిరుపతి జిల్లాల నుంచి వీటిని తెప్పించి విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వోలు ఆర్.రామ్మోహన్, జె.వి.రమణ, ఎం.ప్యాని, సుబ్బనరసయ్య, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

'పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 8: బీజేపీని భూత్ స్థాయి నుంచి ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ రాయలసీమ కోకన్వీనర్ సామంచి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని ఎన్జీవో హోంలో రాయచోటి అసెంబ్లీ కన్వీనర్ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో అసెంబ్లీ ఎన్నికల మేనేజ్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రజల్లోకి ఏ విధంగా తీసుకెళ్లాలి అనే విషయంపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు రేపన శివప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆనంద గజపతిరాజు, కృష్ణయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాస్‌కుమార్‌రాజు, బీజేపీ నాయకులు, సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

చిట్వేలి, ఫిబ్రవరి 8: అధికారులు అనర్హత ఓట్లను తొలగించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని టీడీపీ నేతలు పేర్కొన్నారు. టీడీపీ రాజంపేట పార్లమెంటు పరిధిలోని నాగవరం వడ్డపల్లి గ్రామంలో వారు పర్యటించి స్థానిక ఓటర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు నెలలుగా గ్రామాల్లో తిరుగుతూ వివరాలు సేకరించామన్నారు. అధికారులు ఇప్పటికైనా అనర్హులను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ ఎన్నికల ఇన్‌చార్జ్ వేణుగోపాల్, తుంగా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

రాజంపేట, ఫిబ్రవరి 8: గంటా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పలుచోట్ల మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పట్టణంలోని నూనెవారిపల్లె, శేషన్నగారిపల్లెలో మండల అధ్యక్షుడు సుబ్బనరసయ్య ఆధ్వర్యంలో 500 మందికి పైగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువనాయకులు ప్రసాద్ నాయుడు, సంతోష్ చౌదరి, సునీల్, మద్దిపట్ల సురేంద్ర బాబు, బలరాం తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సుబ్బనరసయ్య, గంటా ట్రస్ట్ సభ్యులు

ఇంటిపట్టాలు మంజూరు చేయాలి

చిన్నమండెం, ఫిబ్రవరి 8: మండలంలోని టి.చాకిబండ గ్రామ పంచాయతీలో ఉన్న నిరుపేదలైన ఎస్టీలకు ఇంటి పట్టాలు, ఇల్లు మంజూరు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకుడు మావులూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఇళ్లు లేని నిరుపేదలతో కలిసి గుడిసెలు వేయించారు. చాకిబండ గ్రామం సచివాలయం వద్ద ప్రభుత్వ స్థలాన్ని పేదలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా నిరుపేదల బతుకులు మారలేదన్నారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి ఎస్టీలకు ఇంటి పట్టాలు, ఇల్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మంజునాథ, అశోక్, మహిళలు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రయాణికుడు మృతి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 8: మహారాష్ట్రకు చెందిన ప్రయాణికుడు రైల్‌లో ప్రయాణిస్తూ గుండెపోటుతో మృతి చెందినట్లు 108 సిబ్బంది తెలిపారు. మహారాష్ట్రకు చెందిన తులసీరామ్ (60) కుటుంబ సభ్యులతో తిరుమల వెంకన్న మొక్కుబడి తీర్చుకొని తిరుగు ప్రయాణమవుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్‌లో అత్యవసరంగా నిలిపివేశారు. చికిత్స అందించే లోపే మృతి చెందినట్లు తెలిపారు.

నులిపురుగుల నిర్మూలనపై సమావేశం

పుల్లంపేట, ఫిబ్రవరి 8: స్థానిక ఎంపీడీవో సభాభవనంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై గురువారం ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 9 నుంచి అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలు, విద్యార్థులందరికీ ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఉపాధ్యాయులందరూ ఆయా పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు అందించాలన్నారు. నులిపురుగుల వల్ల రక్తహీనత ఏర్పడుతుందని, పిల్లల్లో పెరుగుదల ఆగుతుందని వైద్యాధికారి డాక్టర్ సానెశేఖర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారి నరసింహమూర్తి, తహశీల్దారు నరసింహకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నులి పురుగుల దినోత్సవ కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు.

రూ.10 వేల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

సిద్దవటం, ఫిబ్రవరి 8: సిద్దవటం గ్రామ పంచాయతీ ఎస్సీ కాలనీలో నివాసమున్న సంగటి నాగరాజు, పవిత్ర దంపతుల కుమార్తె హర్షితకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వైద్య ఖర్చుల నిమిత్తం రాజంపేట జనసేన నాయకుడు అతికారి కృష్ణ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. జనసేన ముస్లిం మైనార్టీ నాయకుడు మహబూబ్ బాషా ఈ నగదును వారికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ బాగుండాలనే ఉద్దేశ్యంతో ప్రతి పేదవాడికి సాయం చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సిద్దవటంలో భవిష్యత్తుకు గ్యారెంటీ

సిద్దవటం, ఫిబ్రవరి 8: మండల కేంద్రమైన సిద్దవటంలో టీడీపీ రాజంపేట పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తూ ప్రజలను ఇబ్బందులు గురిచేస్తుందని, దుర్మార్గపు పాలనకు ముగింపు పలకాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత తిమ్మిరెడ్డి క్రిష్ణారెడ్డి మృతి



లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 8: టీడీపీ సీనియర్ నేత తిమ్మిరెడ్డి క్రిష్ణారెడ్డి (83) గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈయన 1983 నుంచి టీడీపీలో కొనసాగుతూ మాజీ మంత్రి ఆర్.రాజుగోపాల్‌రెడ్డి కుటుంబానికి సన్నిహితంగా ఉండేవారు. ఈయన నాలుగు పర్యాయాలు అనంతపురం, చౌటపల్లె ఉమ్మడి పంచాయతీకి సర్పంచుగా కొనసాగారు. మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేశ్‌కుమార్‌రెడ్డి హయాంలో నాలుగు పర్యాయాలు గంగమ్మతల్లి దేవస్థానం ఛైర్మన్‌గా కూడా కొనసాగారు. ఎన్టీఆర్ హయాం నుంచి పార్టీలో కొనసాగుతూ చంద్రబాబు హయాంలో ఎన్నో పదవులు అలంకరించారు. ఈయన కుమారుడు ఉమాపతిరెడ్డి కూడా ఎంపీపీగా పనిచేశారు. క్రిష్ణారెడ్డి మృతి పట్ల మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేశ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి (వాసు), కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవిరెడ్డి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మండల టీడీపీ కార్యకర్తలు సంతాపం తెలిపారు.

త్వరలో పెట్రోలు బంక్ ఏర్పాటు

పుల్లంపేట, ఫిబ్రవరి 8: స్థానిక చిట్వేలి రోడ్డులో పోలీస్ క్వార్టర్స్ స్థలంలో ఏప్రిల్ నాటికి పెట్రోలు బంక్ వినియోగంలోకి తీసుకురానున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఐవోసీఎల్ అధికారులతో కలిసి ఆయన పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తున్న స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ స్థలంలో ట్రాన్స్‌ఫార్మర్, తాగునీటి పథకం ఉండటంతో వాటిని వేరే ప్రాంతాలకు మార్చాలని ఐవోసీఎల్ అధికారులు కోరారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

సంబేపల్లె, ఫిబ్రవరి 8: మండల పరిధిలోని దుద్యాల గ్రామం వడ్డెపల్లెలో జూదం ఆడుతున్న పేకాటరాయుళ్లపై ఎస్ఐ రామకృష్ణ గురువారం దాడులు నిర్వహించారు. పోలీసు సిబ్బందితో కలిసి ఆరు మంది పేకాటరాయుళ్లను పట్టుకొని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.2700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఈకేవైసీ తప్పనిసరి

రామాపురం, ఫిబ్రవరి 8: మండల పరిధిలోని ప్రభాకర్ ఇండియన్ గ్యాస్ వినియోగదారులు అందరూ కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలని డిస్ట్రిబ్యూటర్ సీవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉచిత గ్యాస్ కనెక్షన్లను అందజేశామన్నారు. ఈకేవైసీ చేయించుకుంటేనే కేంద్ర ప్రభుత్వం నుంచి అందే సబ్సిడీ పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ మేనేజర్ వెంకట్రామిరెడ్డి, ఈశ్వరమ్మ, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బుగ్గన బడ్జెట్ అంతా అంకెల గారడీనే: అమర్



పలమనేరు, ఫిబ్రవరి 8: రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతే అంకెల గారడీనే అని మాజీ మంత్రి అమరనాథరెడ్డి గురువారం విమర్శించారు. రూ.13వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44 వేల కోట్లకు, రూ. 35వేల కోట్ల ద్రవ్యలోటును రూ. 60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనకే దక్కుతుందన్నారు. పన్నుల బాదుడు తప్ప కొత్త అంశాలు ఏవీలేవన్నారు. వైసీపీ హయాంలో ధరలపెంపు, పన్నుల భారం ప్రజలపై మోపిందన్నారు. రిజిస్ట్రేషన్, విద్యుత్ చార్జీలు భారీగా పెంచిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. మద్యం మీద వచ్చే డబ్బుతో జగన్ సర్కార్ నడుస్తోందన్నారు. ఆరోగ్యశ్రీకి బడ్జెట్‌లో నిధులు అంతంత మాత్రమే ఇవ్వడం, తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ రద్దుచేయడాన్ని చూస్తుంటే ఈ ప్రభుత్వ చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. 35లక్షల పొదుపు గ్రూపులకు బడ్జెట్‌లో మొండిచెయ్యి చూపారని, రైతు భరోసా ద్వారా లబ్ధిదారుల సంఖ్యను భారీగా తగ్గించేశారని ఆరోపించారు.

వైసీపీ పాలనలో అప్పులు రెట్టింపు: టీడీపీ



టీడీపీ నేతలతో కలిసి మాట్లాడుతున్న దొరబాబు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 8: బుగ్గన బడ్జెట్ అంతా అంకెల మాయగా ఉందని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు విమర్శించారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో అంచనాలు కొండంత, ఖర్చులు పిసరంత ఉన్నాయని చెప్పారు. పన్నుల బాదుడు తప్ప కొత్త అంశాలు లేవన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏపీ అప్పులు రెట్టింపు అయ్యాయని అన్నారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో తీసుకువచ్చిన ప్రతి స్కీము ఒక స్కామ్‌గా మారిందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో భారం మోపడం, ధరల పెరుగుదల, రిజిస్ట్రేషన్ చార్జీలపెంపు, విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సమావేశంలో నేతలు సురేంద్ర కుమార్, కోదండయాదవ్, చంద్రప్రకాష్, కాజూరు బాలాజీ, శంకర్, సీఆర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

11న షర్మిల సభకు రండి

● పార్టీ శ్రేణులు, నేతలు, ప్రజలకు డీసీసీ అధ్యక్షుడి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్

కార్వేటినగరం, ఫిబ్రవరి 8: నగరిలోని గడియారం సెంటర్ వద్ద ఈ నెల 11న జరిగే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రచ్చబండ సభకు పార్టీ.. అనుబంధ సంఘాల నేతలు, శ్రేణులు, ప్రజలు తరలిరావాలంటూ డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ పిలుపునిచ్చారు. కార్వేటినగరంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ రోజు రేణిగుంట విమానాశ్రయం నుంచి పుత్తూరు మీదుగా నగరి ఓంశక్తి ఆలయం వరకు నిర్వహించే రోడ్‌షోలో షర్మిల పాల్గొంటారన్నారు. అక్కడ జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఈ సభకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మీడియా అధికార ప్రతినిధి గోవర్ధన్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కన్నన్ పాల్గొన్నారు.

పరిశోధనల్లో పరస్పర సహకారం

వర్క్‌షాప్‌లో ఐజర్ ప్రొఫెసర్ రామ్మూర్తి



మాట్లాడుతున్న ఐజర్ ప్రొఫెసర్ రామ్మూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 8: పరిశోధనల్లో మంచి ఫలితాలను సాధించడం కోసం ఆయా రంగాల్లో పనిచేస్తున్న వ్యక్తులు, సంస్థల మధ్య పరస్పర సహకారం అవసరమని తిరుపతి ఐజర్ ప్రొఫెసర్ రామ్మూర్తి పేర్కొన్నారు. న్యూ హారిజన్స్ ఆఫ్ ఫ్లోరోసిస్ మైక్రోస్కోపీ టెక్నిక్ అంశంపై ఎస్వీయూ జువాలజీ విభాగంలో గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పరస్పర సహకారంతో క్లిష్టమైన అంశాలను ఛేదించడానికి అవకాశం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్ మాట్లాడుతూ పరిశోధనల్లో టెక్నాలజీని ఉపయోగించుకోవడం ద్వారా ఫలితాలను వేగంగా పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఐజర్ ప్రతినిధులు శివకుమార్, సుబ్రమణ్యం, శర్మ, ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, హెడ్ కిషోర్, కన్వీనర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

16నుంచి వ్యవసాయ కాలేజీ కార్మికుల సమ్మె



కార్మికులతో మాట్లాడుతున్న వెంకటేష్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 8: తిరుపతిలోని వ్యవసాయ కళాశాలలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 16 నుంచి సమ్మెకు దిగుతున్నట్లు ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి జి.నాగవెంకటేష్ తెలిపారు. కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతినెలా జీతాలు, టైంస్కేల్ అమలు, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రసూతి, ప్రభుత్వ సెలవులు అమలు చేయాలని కోరారు. సంఘ అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి రాకేష్, సీఐటీయూ నాయకులు ముకేష్, చంద్రమ్మ, రమ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

యాత్రకు రండి బాబూ..రండి!

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8: యాత్ర సినిమాను ఉచితంగా చూసేందుకు రండి బాబూ అంటూ అధికార పార్టీ నాయకులు జనం వెంట పడుతున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో గురువారం పాత్రికేయులకు యాత్ర-2 సినిమా టికెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. రోజు మొత్తం ఆడిన నాలుగు ఆటల్లో వీలుపడినప్పుడు సినిమాను చూడవచ్చనే వెసులుబాటు కూడా కల్పించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి ఇచ్చిన ఈ ఉచిత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సామాజిక మాధ్యమాల ద్వారా కోరడం చర్చనీయాంశంగా మారింది. ఇదే తరహాలో వైసీపీ కార్యకర్తలు ఉచితంగా సినిమాను వీక్షించేందుకు రావాలంటూ తెలిసిన వారి వెంట పడుతున్నట్టు సమాచారం.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.59 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.59 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 65,683 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,177 మంది తలనీలాలు సమర్పించారు.

సైంటిస్టు పోస్టులకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 8 : స్విమ్స్ యూనివర్సిటీ క్లినికల్ వైరాలజీ విభాగంలోని పలు కాంట్రాక్టు పోస్టులకు ఈనెల 12న వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణబిట్ల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సైంటిస్టు-సి 1, సైంటిస్టు-బి 1 రెండు నాన్ మెడికల్ పోస్టులతో పాటు ప్రాజెక్ట్ రీసెర్చ్ అసిస్టెంట్(నాన్ మెడికల్) 1 పోస్టు ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి చేసిన దరకాస్తులతో పాటు అన్ని సర్టిఫికెట్లు తీసుకుని 12వ తేదీ ఉదయం 8 గంటలకు డైరెక్టర్ చాంబర్ వద్ద ఉన్న కమిటీ హాల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో జాడలేని ఓటరు జాబితా

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 8: ఇప్పటికీ చిత్తూరు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల తుది జాబితాను అందుబాటులో ఉంచలేదు. ఈ జాబితాలో ఏవైనా తప్పులుంటే.. ఓటర్లు పరిశీలించుకొని సవరణ చేసుకోవచ్చునని అధికారులు తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో, చిత్తూరు ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయంలో జాబితాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఇప్పటి వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా లేదు. దీంతో ఓటరు జాబితాలో తమ ఓటు ఉందా, లేదా అని ఎలా పరిశీలించుకోవాలని ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. జాబితాలో పేరు చూసుకునేందుకు ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. అక్కడ వందలాది పేజీలున్న జాబితాలో తమ పేర్లను ఎలా గుర్తించాలని ప్రశ్నిస్తున్నారు. జాబితాపై బీఎల్‌వోలను అడిగినా సమాధానం ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను ప్రచురించాలని కోరుతున్నారు.

● ఎల్‌బీ పురంలోని 96, బండపల్లిలోని 51వ పోలింగ్ కేంద్రంల్లో ఓటర్ల జాబితా జాడ లేదు. ఓటర్లు తమ ఓటు ఉందా లేదా అని తెలుసుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చి వెనుదిరుగుతున్నారు. కేంద్రంలో బీఎల్‌వోలు కూడా అందుబాటులో లేకపోవడంతో ఓటర్లు జాబితాలో తమ ఓటు ఉందా లేదా అని ఎలా తెలుసుకోవాలో పాలుపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● సత్యనారాయణపురంలోని 53, 114 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడా ఇదే పరిస్థితి. జాబితా విడుదల చేసిన తర్వాతి రోజున పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించినట్లు ఫొటోలు దిగి వెళ్లిపోయారు. ఆ తర్వాత జాబితా కావాలంటే వారిని సంప్రదించాల్సిన పరిస్థితి నెలకొంది. వృద్ధ ఓటర్ల పరిస్థితి అయితే మరి దారుణంగా మారింది. చిత్తూరు నగరంలో, రూరల్ మండలంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

పోలింగ్ కేంద్రాలు మారినా...

గత ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. దీంతో పోలింగ్ కేంద్రాల నెంబర్లు మారాయి. ఇప్పటికే ఆ పోలింగ్ కేంద్రాల్లో పాత నెంబర్లే దర్శనమిస్తున్నాయి. దీంతో ఓటర్లు కూడా కన్ఫ్యూజ్ అవుతున్నారు. ఇప్పటికైనా పోలింగ్ కేంద్రాల నెంబర్లు మార్పు చేయాల్సి ఉంది.

నీళ్ల బిల్లులు రావాలంటే యుద్ధం చేయాల్సిందే

● సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నీటి సరఫరాదారుల వాయిస్ మెసేజ్

వి.కోట, ఫిబ్రవరి 8: గ్రామాల్లో నీటి సరఫరా చేసిన బిల్లులు వచ్చేట్లు లేవు. బిల్లులు రావాలంటే యుద్ధం చేయాల్సిందే అంటూ సోషల్ మీడియాలో వాయిస్ మెసేజ్ వైరల్ అవుతోంది. తన సహచర నీటి సరఫరాదారులను ఉద్దేశించి ఈ మెసేజ్ పెట్టారు. వైసీపీ అధికారంలోకి రాగానే.. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో నీటి ఎద్దడి నివారణకు గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేశారు. ఇప్పటి వరకు ఆ బిల్లులు రాకుండా ట్యాంకర్ల యజమానులు ఇబ్బంది పడుతున్నారు. వీరిలో వైసీపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలే ఎక్కువ. వీరందరికీ సుమారు రూ.20 కోట్ల మేరకు బిల్లుల బకాయి ఉంది. పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. పలుమార్లు విజయవాడ చేరుకుని అక్కడ ప్రభుత్వ పెద్దలతో చర్చించినా హామీలకే పరిమితమైంది. ఈ క్రమంలో రెండు వారాల కిందట కుప్పం పర్యటనకు వెళ్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్‌కి వి.కోటలో అడ్డుపడి తమ సమస్య చెప్పారు. తిరుగు ప్రయాణంలో మంత్రి బాధితుల వద్ద ఉన్న బిల్లుల వివరాలను తీసుకున్నారు. త్వరలో బకాయిల విడుదలకు కృషి చేస్తానని చెప్పి వెళ్లారు. రోజులు గడుస్తున్నా బిల్లులు రాలేదు. ఈ క్రమంలో.. 'మన వాటర్ బిల్లులు గోవిందా.. గోవింద. మన బిల్లులు, ఎంబుక్‌లు విజయవాడ చేరాయి. ఏఈలు డబ్బులు తీసుకుని తప్పుగా రికార్డు చేశారని విజయవాడ ఈఎన్సీకి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో విజిలెన్సుకు వేశారు. ఇక మన బిల్లులు రావు. బిల్లులు మరచిపోండి. బిల్లులు రావాలంటే యుద్ధం చేయాల్సిందే. ప్రతి ఒక్కరు రోడ్డు ఎక్కాల్సిందే' అంటూ వాయిస్ మెసేజీ వైరల్ అవుతోంది. అప్పులు చేసి నీళ్లు తోలితే బిల్లులు ఇవ్వకుండా తమను వేధిస్తున్నారంటూ అధికార పార్టీ వారే బాహాటంగా తమ ఆక్రోశాన్ని వెల్లగక్కుతున్నారు.

బదిలీలలు

తిరుపతి అర్బన్‌కు తహసీల్దార్‌ను రానీయకుండా రాజకీయ ఒత్తిళ్లు

డీటీకే పూర్తి బాధ్యతలు కట్టబెట్టే వ్యూహం

తిరుపతికి నియమించిన నాగేశ్వరరావు రేణిగుంటకు మార్పు


తిరుపతి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి అర్బన్ తహసీల్దార్‌గా పనిచేసేందుకు భయపడుతుండడం అటుంచితే, బాధ్యతలు తీసుకోనివ్వకుండా కూడా భయపెడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటరమణను కడప అర్బన్‌కు బదిలీ చేసి, కడప జిల్లా యర్రగుంట్ల తహసీల్దార్ నాగేశ్వరరావును ఇక్కడికి బదిలీ చేశారు. అయితే ఆయన బాధ్యతలు తీసుకునేందుకు వచ్చే క్రమంలో రాజకీయ ఒత్తిళ్లు వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ఆయన రేణిగుంట తహసీల్దార్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించాల్సివచ్చింది. తిరుపతి అర్బన్‌లో డీటీగా ఉన్న అశోక్ రెడ్డి ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్నారు. ఆయనకే పూర్తి బాధ్యతలు అప్పగించేందుకు అధికార పార్టీ నేతలు వ్యూహం పన్నుతున్నారన్న విమర్శలున్నాయి. పదేళ్లకు పైగా అర్బన్ కార్యాలయంలో పనిచేస్తున్న ఈయన వ్యవహారశైలిపై విపక్షాలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి. తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో అవకతవకలు జరగడంలో ఆయన ప్రమేయం ఎక్కువగా ఉందని, అంతకుముందు 2019 సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ అవకతవకలపై కూడా ఆయనపై ఆరోపణలున్నాయని విపక్షాలు అంటున్నాయి. తిరుపతి ఉప ఎన్నికకు సంబంధించి ఈఆర్వోగా పనిచేసిన అప్పటి మున్సిపల్ కమిషనర్ గిరీష, ఏఈఆర్వోగా పనిచేసిన తహసీల్దార్ జయరాములు సస్పెండైన విషయం తెలిసిందే. ఈక్రమంలో జరిగిన ఎన్నికల బదిలీలలో నాగేశ్వరరావును తిరుపతి అర్బన్ మండలానికి బాధ్యతలు తీసుకోనివ్వకుండా అడ్డుకున్నారని తెలుస్తోంది.దీంతో కడప జిల్లానుంచి బదిలీపై రేణిగుంటకు కేటాయించిన నారాయణ రెడ్డిని తిరుపతి అర్బన్‌కు మార్చారు.అయితే ఆయనను కూడా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్టు రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే అధికార పార్టీలోని ప్రధాన సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కాబట్టి బాధ్యతలు తీసుకోవచ్చనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్‌లు, ఈవీఎం యంత్రాల భద్రతకు సంబంధించిన వ్యవహారాలు చూసుకోవాల్సిన బాధ్యత తహసీల్దార్‌పైనే ఉంటుంది. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి ఈఆర్వోగా మున్సిపల్ కమిషనర్, ఏఈఆర్వోలుగా అర్బన్ తహసీల్దార్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్లు వ్యవహరిస్తారు. ఎన్నికల విధుల్లో మరో డిప్యూటీ తహసీల్దార్ ఉంటారు. ఆయనే ఏఈఆర్వోగా ఉంటే పారదర్శకంగా ఎన్నికలు ఎలా జరుగుతాయని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పలువురు తహసీల్దార్లకు మళ్లీ బదిలీ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 8: జిల్లాకు కొంతమంది తహసీల్దార్లుగా బదిలీపై వచ్చారు. అయితే తెరవెనుక ఏం జరిగిందో తెలియదు కానీ రెండు రోజుల వ్యవధిలో పలువురి స్థానాలు మారిపోయాయి.తిరుపతి అర్బన్ తహసీల్దారుగా నియమించిన బడిన నాగేశ్వరరావును రేణిగుంటకు,రేణిగుంటకు కేటాయించిన ఎంవీఎస్ నారాయణరెడ్డిని తిరుపతికి, బీఎన్‌కండ్రిగ తహసీల్దారుగా ఉన్న బాలకిషన్‌ను ఎర్రావారిపాళేనికి బదిలీ చేస్తూ కలెక్టర్ లక్ష్మీశ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న సయ్యద్ నౌషద్ అహ్మద్ గూడూరు ఆర్డీవో కార్యాలయ ఏవోగా, అక్కడ పనిచేస్తున్న ఆదిశేషయ్య సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయ ఏవోగా బదిలీ అయ్యారు. నాగలాపురం తహసీల్దారు ప్రసన్నకుమార్‌ను తిరుపతి ఆర్డీవో కార్యాలయ ఏవోగా నియమించారు. ఓజిలి తహసీల్దారు శివరామ సుబ్బయ్యను తొట్టంబేడుకు, గుంటూరు నుంచి వచ్చిన గోపాలకృష్ణన్‌ను సూళ్ళూరుపేటకు, అక్కడ పనిచేస్తున్న కల్యాణిని నాయుడుపేటకు తహసీల్దార్లుగా నియమించారు. నెల్లూరు నుంంచి సయ్యద్ ఇక్బాల్ తడ తహసీల్దారుగా బదిలీ అయ్యారు.

17న జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగం

ఉపగ్రహ అనుసంధాన పనుల పూర్తి



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8: ఇస్రో మరో కీలక ప్రయోగానికి సన్నద్ధమైంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెల 17న సాయంత్రం 5.30 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్‌ను ప్రయోగించనుంది. ఈ రాకెట్ ద్వారా ఇన్‌శాట్-త్రీడీఎస్ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక సమీపంలోని వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో ఇప్పటికే రెండు దశల రాకెట్ అనుసంధాన పనులు పూర్తయ్యాయి. గురువారం వ్యాబ్‌లో రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహ అనుసంధానం చేపట్టి శాటిలైట్ చుట్టూ హీట్‌షీల్డ్ (ఉష్ణకవచం) అమర్చే ప్రక్రియను పూర్తి చేశారు.తుది పరీక్షలు నిర్వహించిన తరువాత రాకెట్‌ను ప్రయోగ వేదికకు తరలిస్తారు.

→ ఇన్‌శాట్-త్రీడీఎస్ ఉపగ్రహం చుట్టూ అమర్చిన హీట్‌షీల్డ్

అగ్రోవెట్‌తో పద్మావతి వర్సిటీ ఒప్పందం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 8: పట్టు ఉత్పాదకత పెంపొందించే లక్ష్యంతో రెయిన్‌బో అగ్రోవెట్ సంస్థతో పద్మావతి మహిళా యూనివర్సిటీ ఒప్పందం చేసుకుంది. ఇందుకు సంబంధించిన పత్రాలపై ఇరు సంస్థల అధికారులు గురువారం సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రోవెట్ ఎండీ సుబ్బరాయుడు, డీన్ సుజాత, హెడ్ మమత, అధ్యాపకులు సావిత్రి, విజయకుమారి పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల అధికారులు

నామసంకీర్తన భగవంతుడికి ప్రీతికరమైంది

పురందరదాసు ఆరాధన మహోత్సవాల్లో విద్యాప్రసన్నతీర్థ





తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మానవ జీవితం సమస్యల వలయమని, వీటి నుంచి బయట పడాలంటే నామసంకీర్తన మంచి మార్గమని బెంగళూరులోని కుక్కే సుబ్రహ్మణ్య మఠాధిపతి విద్యాప్రసన్న తీర్థ ఉద్ఘాటించారు. నామ సంకీర్తన భగవంతుడికి అత్యంత ప్రీతికరమైందన్నారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పురందరదాసు ఆరాధన మహోత్సవాలు గురువారం తిరుమలలోని ఆస్థాన మండపంలో ప్రారంభమయ్యాయి. విద్యాప్రసన్నతీర్థ మంగళాశాసనాలు అందిస్తూ.. భగవంతుడిని చేరాలంటే ముందు ఆయన పరమభక్తుల అనుగ్రహం అవసరమని పురాణాలు పేర్కొంటున్నాయని, ఈ కోవకు చెందిన భక్తుడు పురందరదాసు అని అన్నారు. ఆయన రచించిన లక్షలాది కీర్తనలను ఆలపిస్తూ అనేక మంది స్వామి కృపకు పాత్రులవుతున్నారన్నారు. దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు మాట్లాడుతూ 4.75 లక్షల సంకీర్తనలు రచించడం పురందరదాసుకే సాధ్యమైందన్నారు. అనంతరం విద్యాప్రసన్న తీర్థను సన్మానించారు. ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి 3,500 మందికిపైగా భజనమండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

నేడు నారాయణగిరికి శ్రీవారి వేంచేపు

ఆరాధన మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సంగీత, సాహిత్య రంగాలలో నిష్ణాతులైన యువ కళాకారులకు ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నారు. సాయంత్రం 6 గంటలకు తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనానికి శ్రీవారి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి, ఊంజల్‌సేవ నిర్వహిస్తారు.

జగనన్న కాలనీకోసం స్థలం చదును

● మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం



స్థలాన్ని చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్లు

నగరి, ఫిబ్రవరి 8: ఎంత అడ్డుకున్నప్పటికీ తన ఇంటి స్థలాన్ని అధికారులు జగనన్న కాలనీకి తీసుకునేందుకు చదును చేయడంపై మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. బాధితురాలి కుటుంబీకులు తెలిపిన ప్రకారం.. నగరి మండలం కేజీ కుప్పానికి చెందిన సుమిత్రకు, అదే గ్రామంలో సుమారు 50 సెంట్ల గ్రామకంఠం భూమి ఉంది. ఏళ్ల తరబడి తన అధీనంలో ఉన్న భూమిని అధికారులు జగనన్న కాలనీకి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించగా ఆమె అడ్డు చెప్పారు. అయినా, అధికారులు పట్టించుకోకుండా గురువారం ఎక్స్‌కవేటర్లతో సంబంధిత భూమిని చదును చేశారు దీనిపై తీవ్ర మనోవేదనకు గురైన ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. స్థానికులు, బంధువులు గుర్తించి హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

చిత్తూరు లోక్‌సభ టీడీపీ టికెట్టుకోసం మాజీ ఎమ్మెల్యే కుమార్తె దరఖాస్తు



డాక్టర్ ఆశాజ్యోతి

పలమనేరు, ఫిబ్రవరి 8: చిత్తూరు పార్లమెంట్ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసేందుకు తనకు అవకాశమివ్వాలని కోరుతూ పలమనేరు మాజీ ఎమ్మెల్యే ఆంజినేయులు కుమార్తె ఆశాజ్యోతి(43) దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 4వతేది తన తండ్రి ఆంజినేయులుతో కలిసి ఆమె విజయవాడ వెళ్లారు. టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. పలమనేరు నియోజకవర్గం నుంచి తొలిసారిగా తెలుగుదేశం పార్టీ నుంచి పోటీచేసి గెలిచిన ఆంజినేయులును చంద్రబాబు గుర్తించి సాదరంగా మాట్లాడారు. చిత్తూరు పార్లమెంట్ స్థానానికి తన కుమార్తెకు అవకాశమివ్వాలని ఆయన కోరారు. ఆ తర్వాత పార్టీ కార్యాలయంలో తన బయోడెటాతో పాటు ఆశాజ్యోతి దరఖాస్తు చేసుకొన్నారు. ప్రస్తుతం ఈమె కుప్పం పీఈఎస్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

● డ్రైవర్ అరెస్టు.. అసలు నిందితుడు పరారీ



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

వి.కోట, ఫిబ్రవరి 8: కర్ణాటకలో మద్యం కొనుగోలుచేసి వాహనాల్లో తరలించి మండల పరిధిలోని గ్రామా ల్లో విక్రయించే ముఠాను సీఐ లింగప్ప నేతృత్వంలో పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఉదయం బైరుపల్లె క్రాస్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా అటుగా వచ్చిన కారు పోలీసులను చూసి వెనుతిరిగేందుకు యత్నించారు. పోలీసులు వెంబడించి పట్టుకుని సోదాచేయగా అందులో కర్ణాటక మద్యం భారీ ఎత్తున ఉన్నట్లు గుర్తించారు. రామకుప్పం మండలం కవ్వంపల్లెకు చెందిన కారు డ్రైవర్ అరుణ్‌కుమార్‌రెడ్డి పట్టుబడగా, ఇదే మండలం బలదారుకు చెందిన అసలు నిందితుడు వసంత్‌కుమార్‌రెడ్డి పరారయ్యాడు. ఈ మేరకు వి.కోట పోలీసులు కేసు నమోదు చేశారు. 30 కేసుల మద్యంతోపాటు, ఓ కారును సీజ్ చేసి అరుణ్‌కుమార్‌రెడ్డిని రిమాండుకు తరలించినట్లు పలమనేరు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మద్యం విలువ సుమారు రూ.1.03 లక్షలు, సీజ్ చేసిన వాహనం విలువ రూ.5 లక్షలు మేరకు ఉంటుందన్నారు. నిందితులు వైసీపీకి చెందిన వారు కావడంతో వారిపై కేసు లేకుండా చేసేందుకు అధికార పార్టీనేతలు పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం.

శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.10,01,000 విరాళం



స్విమ్స్ డైరెక్టర్‌కు డీడీ అందజేస్తున్న కంపెనీ ప్రతినిధి రాఘవేంద్ర

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 8 : స్విమ్స్‌లో పేదలకు ఉచిత వైద్యం అందించే శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి చెన్నైకు చెందిన సీఎంజీ స్టీల్స్ కంపెనీ రూ. 10,01,000 విరాళంగా అందించింది. ఈ మేరకు తిరుపతికి చెందిన ఆ కంపెనీ ప్రతినిధి రాఘవేంద్ర గురువారం స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్‌ను డైరెక్టర్ చాంబర్‌లో కలిసి డీడీని అందజేశారు. పేదల వైద్య సేవల కోసం ఈ నగదు వినియోగించాలని కోరారు. డైరెక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ పేదలకు వైద్యం అందించేందుకు సహకరించిన సీఎంజీ స్టీల్స్ కంపెనీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ బీఎస్ఎఫ్ జవాను దుర్మరణం

● స్వగ్రామమైన చుంచువారిపల్లెలో అంత్యక్రియలు


భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్థులు, బీఎస్ఎఫ్ అధికారి


నాగభూషణం నాయుడు(ఫైల్)

ములకలచెరువు, ఫిబ్రవరి 8: కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు సమీపం లోని హోస్‌కోట వద్ద జరిగిన రోడ్డు ప్రమదంలో రిటైర్డ్ బీఎస్ఎఫ్ జవాన్ నాగభూషణంనాయుడు(57) దుర్మరణం చెందారు. ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గ్రామస్థుల కథనం మేరకు...ములకలచెరువు మండలం చౌడసముద్రం పంచాయతీ చుంచువారిపల్లెకు చెందిన నాగభూషణంనాయుడు బీఎస్ఎఫ్ జవానుగా పనిచేస్తూ ఐదేళ్ల క్రితం పదవీ విరమణ చేశారు. అనంతరం బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో విధుల నిమిత్తం బుధవారం సాయంత్రం బెంగళూరు నుంచి మదనపల్లెకు ద్విచవాహనంలో వస్తుండగా మార్గ మధ్యంలో కారు ఢీకొనడంతో అతను తీవ్రంగా గాయపడి దుర్మరణం చెందాడు. దీంతో అంత్యక్రియల నిమిత్తం గురువారం భౌతికకాయాన్ని స్వగ్రామమైన చుంచువారిపల్లెకు తీసుకొచ్చారు. కలికిరి బీఎస్ఎఫ్ ఎస్ఐ తిమ్మిశెట్టి, జిల్లా బీఎస్ఎఫ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి గ్రామానికి చేరుకుని భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. అలాగే భౌతికకాయంపై జాతీయపతాకాన్ని కప్పి అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల నిమిత్తం కుటుంబీకులకు రూ.8వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుడికి భార్య జ్యోతి, కుమార్తెలు జోష్నా, లహితీలు ఉన్నారు. రిటైర్డ్ జవాను మృతితో గ్రామంలో తీవ్ర విషాధఛాయలు అలుముకున్నాయి.

గొంతు కోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బికొత్తకోట ఫిబ్రవరి 8 : స్థానిక ఇందిరమ్మకాలనీలో నివాసం ఉంటున్న నరసింహులు(58)జీవితంపై విరక్తి చెంది కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. నరసింహులుకు భార్యతో పాటు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చాలా కాలం క్రితమే భార్య ఇతన్ని విడిచి వెళ్లి పోయింది. కుమారుడు, కుమార్తెలు సైతం తనతో లేరు. క్షయ వ్యాది గ్రస్తుడైన నరసింహులు ఒంటరి జీవితాన్ని గడుపుతూ ఉన్నాడు. జీవితంపై విరక్తి చెంది గురువారం కత్తితో గొంతు కోసుకున్నాడు. దీంతో గొంతు బాగా తెగిపోయింది. ఇది గమనించిన చుట్టు పక్కల వారు బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి, ఇక్కడి నుంచి 108 వాహనంలో మదనపల్లెకు తరలించారు. తీవ్ర గాయంతో పరిస్థితి విషమంగా ఉండడంతో మదనపల్లె ఏరియా ఆసుపత్రి వైద్యులు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మదనపల్లె జిల్లా అవుట్ పోస్టు పోలీసులు ఇచ్చిన సమాచారంతో బికొత్తకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి నుంచి పారిపోయిన బాలుడి అప్పగింత


బాలుడు చరణ్‌ను అతడి తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

కలికిరి, ఫిబ్రవరి 8: ఇంట్లో అలిగి చెప్పకుండా పారిపోయి కలికిరికి చేరుకున్న చరణ్ (11) అనే బాలుడిని కలికిరి పోలీసులు అతడి తల్లికి గురువారం అప్పగించారు. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆర్.మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. నిమ్మనపల్లె మండలానికి చెందిన చరణ్ వాల్మీకిపురం మండలం చింతపర్తిలో ఐదవ తరగతి చదువుతున్నాడు. ఇంట్లో తల్లిదండ్రులపై అలిగి చెప్పకుండా పారిపోయి కలికిరి వచ్చి పట్టణంలో తిరుగాడుతుండగా సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ మోహన్ సిబ్బందిని పంపించి బాలుడిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి వివరాలు అడిగి తెలుసుకుని తల్లి శోభారాణిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. అనంతరం ఆమెకు, బాలుడు చరణ్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి బాలుణ్ణి అప్పగించారు. కార్యక్రమంలో తాత్కాలిక ఎస్ఐ చలపతి, ఏఎస్ఐ మధుసూదనాచారి, పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో పొగలు

పెద్దమండ్యం, ఫిబ్రవరి 8: మదనపల్లి ఆర్టీసీ 2 డిపోకు చెందిన మదనపల్లి వయా కోటకొండ గాలివీడు మార్గంలో నడిచిన ఆర్టీసీ బసులో బ్యానెట్ నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సులో ఫ్యాన్ బెల్ట్ ఊడిపోవడంతో కొండకొండ సమీప గ్రామం కుమ్మరపల్లి వద్ద బస్సును డ్రైవర్ ఆపివేసి డిపో మేనేజర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఒకటిన్నర గంట పాటు ప్రయాణి కులు ఇబ్బందులు పడ్డారు.

గణేశ్ కుటుంబానికి రూ.కోటి పరిహారమివ్వాలి

పీలేరు, ఫిబ్రవరి 8: ఎర్రచందనం స్మగ్లర్ల చేతిలో హతమైన ఏఆర్ కానిస్టేబుల్ గణేశ్ కుటుంబానికి రూ.కోటి పరిహారంగా చెల్లించాలని జనసేన పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బెజవాడ దినేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవీపల్లె మండలం ఎంవీపల్లె పంచాయతీ చెరవు ముందు గుండ్రేవారిపల్లె వద్ద గణేశ్ ఉదంతం జరిగిన ప్రదేశాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ మృతికి కారణమైన కారుకు ఆరు నెంబరు ప్లేట్లు ఉన్న ట్లు తెలిసిందని, ఆ ఆరింటిలో ఒక నెంబరు ప్లేటు ఆధా రంగా విచారిస్తే ఆ కారు కేవీపల్లె మండలానికి చెందిన ఓ వైసీపీ నాయకుడిగా తెలుస్తోందన్నారు. పోలీసులు గణేశ్ ఉదంతంలో ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా ఘటనలో ప్రమే యం ఉన్న ఎంతటి వారైనా శిక్షించాలన్నారు. గణేశ్ కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కూడా కల్పించాలని ఆయన కోరారు.

ఏదైనా జరిగే వరకు పట్టించుకోరా..?

●గుర్రంకొండలో బయట రాష్ట్రాల వ్యక్తులు ●పోలీసుల నిఘా పెంచి చర్యలు తీసుకోవాలంటూ స్థానికుల వినతి


గుర్రంకొండలో ఉన్న బయట రాష్ట్రాల వ్యక్తులు


చత్తీస్‌గడ్ పోలీసులకు బాలికను అప్పగిస్తున్న స్థానిక పోలీసులు (ఫైల్‌పోటో)

గుర్రంకొండ, ఫిబ్రవరి 8:ఏదైనా జరగరాని సంఘటన జరిగాకే పోలీసు యంత్రాంగం స్పందిస్తుందా? అని గుర్రంకొండ పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. గుర్రంకొండ పట్టణంతోపాటు కొన్ని గ్రామాల్లో బయట రాష్ట్రాల వ్యక్తులు అధికంగా ఉన్నారు. వారిలో ఎక్కువ సంఖ్యలో బీహార్, చత్తీస్‌గడ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు సుమారు 1500 మంది ఉన్నారు. ఇందులో కొందరు ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాలు, వ్యవసాయ పొలాలు, హోటళ్లు, టీ దుకాణాలు, వాటర్‌ప్లాంట్‌లు, టమోటా మార్కెట్ యార్డులో పని చేస్తున్నారు. సాయంత్రమైతే ఎక్కడ చూసిన గుంపులు, గుంపులుగా రోడ్లపై ఉంటుండడంతో పట్టణంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్ని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బయట వ్యక్తులను రప్పిస్తున్న దెవరు..?

గుర్రంకొండ పట్టణం, గ్రామాల్లో వివిధ పనులు చేయడానికి బయట రాష్ట్రాల వ్యక్తులను రప్పిస్తున్నదెవరని తెలియడం లేదు. దీంతో వీరు వచ్చిన సమయంలో కొన్ని నెలలు మాత్రమే ఓ చోట పని చేయడం ఆ తర్వాత మరో చోటికి వెళ్లిపోతుండడం జరుగుతోంది. అసలు బయట రాష్ట్రాల వ్యక్తులను పిలిపిస్తున్న మేస్త్రీలకు కూడా ఎవరు ఎక్కడున్నది తెలియడం లేదు. ఒక వేళ జరగరాని సంఘటన జరిగితే దానికి బాధ్యులెవరన్నది అంతు చిక్కని ప్రశ్నగా మారింది.

బయట వ్యక్తుల వివరాలు ఎక్కడ దొరుకుతాయి...

పట్టణం, గ్రామాల్లో వివిధ పనులు చేయడానికి వచ్చే కూలీల వివరాలు ఏ మేస్త్రీ వద్ద దొరకుతాయో అంతుచిక్కని సమస్యగా మారింది. బయట రాష్ట్రాల వ్యక్తులు ఇక్కడ పని చేయాలంటే ముందుగా వచ్చిన వ్యక్తుల ఆధార్ కార్డు, నివాస ప్రాంతం, ఆయా రాష్ట్రాల్లోని పోలీస్ స్టేషన్‌లో వారిపై ఎటువంటి కేసులు లేవని సర్టిఫికేట్ తీసుకోవాలి. ఈ వివరాలను మేస్త్రీలు సేకరించి వారి వద్ద ఉంచుకోవాలి. అయితే చాలా మంది బయట వ్యక్తుల నుంచి ఎటువంటి వివరాలను సేకరించడం లేదు. అవసరమైన వారికి బయట రాష్ట్రాల నుంచి కూలీలను పిలిపించి తమ రావాల్సిన కమీషన్‌లను తీసుకొని మేస్త్రీలు ఉండిపోతున్నారు. దీంతో ఏ కూలీ ఏ రాష్ట్రానికి చెందిన వాడో తెలియడం లేదు.

ఝార్ఖండ్‌లో అదృశ్యం...గుర్రంకొండలో ప్రత్యక్షం

ఝార్ఖండ్ రాష్ట్రంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలికను అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు మాయ మాటలు చెప్పి ఇంటి నుంచి ఏడాది క్రితం తీసుకొచ్చేశాడు. ఈ క్రమంలో యువకుడు బాలికను 8 నెలలు పాటు కడప ప్రాంతంలో ఉంచి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించారు. అనంతరం అక్కడ నుంచి గుర్రంకొండ మండలం తరిగొండ సమీపంలోని ఓ వ్యవసాయ ఎస్టేట్‌లో పని చేయడానికి మూడు నెలలు క్రితం చేరారు. ఈ నేపథ్యంలో బాలిక కోసం ఝార్ఖండ్ పోలీసులు వెతుకుతూ గుర్రంకొండకు చేరుకుని స్థానిక పోలీసుల సహకారంతో బాలిక తరిగొండ వద్ద ఉన్నట్లు గుర్తించారు. దీంతో బాలికతోపాటు ఆమెను తీసుకొచ్చిన యువకుడ్ని కూడా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. ఈ క్రమంలో స్థానిక పోలీసుల నుంచి బాలికను స్వాధీనం చేసుకొని వారు ఝార్ఖండ్ తీసుకెళ్లారు. ఇలా వివిధ రాష్ట్రాలు నుంచి వచ్చిన కూలీల్లో ఎంత మంది నేరస్థులు న్నారు..?ఎంత మంది మంచి వారు ఉన్నారన్నది తెలియదు.

తగు జాగ్రత్తలు తీసుకొంటాం



గుర్రంకొండలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి కూలీ పనులు చేస్తున్న వ్యక్తుల వివరాలను సేకరించి తగు జాగ్రత్తలు తీసుకుంటాం. . అలాగే వారిని స్టేషన్‌కు పిలిపించే మేస్త్రీలు ఎంత మంది ఉన్నారో..? వివరాలు తెలుసుకుంటాం. అలాగే బయట వ్యక్తులకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి పకడ్బందీ చర్యలు చేపడతాం.

-నాగార్జునరెడ్డి, ఎస్ఐ, గుర్రంకొండ

బీటీ కళాశాలపై తప్పుడు ప్రచారం సరికాదు

●యూనివర్సిటీగా మార్చారంటూ వైసీపీ సంబరాలు చేయడం విడ్డూరం ● ధర్నాలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకుల ధ్వజం


బీటీ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 8: మదనపల్లె బీటీ కళాశాలను యూనివర్సిటీగా మార్చారంటూ వైసీపీ నాయకులు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా వుందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ్ ధ్వజమెత్తారు. గురువారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్బంగా సీపీఐ నేత మురళి మాట్లాడుతూ బీటీ కళాశాలను యూనివర్సిటీగా మంత్రి మండలి నిర్ణయం తీసుకుందంటూ వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారన్నారు. ఏడాది క్రితం ప్రభుత్వ పరమైన కళాశాలలో లెక్చరర్ల కొరత వుందని, కేవలం గెస్ట్ లెక్చరర్ల బోధనలతో 15శాతం మాత్రమే ఉత్తీర్ణత వచ్చిందన్నారు. రాష్ట్ర మంత్రి మండలిలో నంద్యాల, రాజంపేట, రాజమండ్రిలో మాత్రమే మూడు ప్రైవేటు యూనివర్సిటీలపై నిర్ణయం తీసుకుందని అసలు బీటీ యూనివర్సిటీ పేరే ఎత్తలేదన్నారు. ఒక వేళ అదే జరిగి వుంటే ప్రభుత్వం జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా దక్కవని, అందుకే బీటీ యూనివర్సిటీ అంశాన్ని తెరపైకి తెస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఉత్తన్న, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు ప్రభాకర్, బీసీవై నాయకుడు సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కలికిరి, ఫిబ్రవరి 8: విచ్చలవిడిగా జరుగుతున్న సైబర్ క్రైమ్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆర్. మోహన్ కోరారు. మండలంలోని మేడికుర్తి గ్రామంలో గురువారం రాత్రి స్థానికలతో సమావేశం ఏర్పాటు చేసి రాబోయే ఎన్నికల సందర్భంగా అందరూ సంయమనంగా వ్యవహరించాలని సూచించారు. అంతకు ముందు మేడికుర్తి, పారపట్ల, రంగనాథపురం, కొటాల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌సీ కొండప్ప, పీసీలు నాగరాజ, జిలానీ, చైతన్య తదితరులున్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా

ములకలచెరువు, ఫిబ్రవరి 8: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్నందున సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సీఐ తమ్మిశెట్టి మధు ఆదేశించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం మండలాల్లోని పోలింగ్ కేంద్రాల సెక్టోరియల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎస్ఐలు తిప్పేస్వామి, రవీంద్రబాబు, వెంకటేశ్వర్లు, శివప్రసాద్ పాల్గొన్నారు.

బి.కొత్తకోట ఎస్ఐగా దిలీప్ కుమార్

బి.కొత్తకో ఫిబ్రవరి 8 : బి.కొత్తకోట రెండవ ఎస్ఐగా నియమితులైన దిలీప్ కుమార్ గురువారం బాధ్యతలను చేపట్టారు. పీలేరు అర్బన్ పోలీస్ స్టేషన్ లో పని చేస్తూ బదిలీపై ఆయన బి.కొత్తకోట పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. బి.కొత్తకోట పోలీస్ స్టేషన్ ను అప్ గ్రేడ్ చేశారు.

ఘనంగా ఆదర్శ పాఠశాల వార్షికోత్సవాలు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 8 : పీటీఎం ఆదర్శ పాఠశాలలో గురువారం వార్షికోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ వార్షికోత్సవానికి ఎంఈవో నారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించాయి. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'అపెడా' ద్వారా మామిడిలో విస్తృత వ్యాపార అవకాశాలు

పీలేరు, ఫిబ్రవరి 8: కేంద్ర ప్రభుత్వ అధీనంలోని అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రోడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ(అపెడా)లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా మామిడి రైతులకు విస్తృత వ్యాపార అవకాశాలు లభిస్తాయని జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్రబాబు పేర్కొన్నారు. పీలేరు మండలం తలపుల గ్రామంలోని అన్నమయ్య రైతు ఉత్పత్తిదారుల సంఘంలోని రైతులకు గురువారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో జరిగిన 'అపెడా' రిజిస్ట్రేషన్ల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని మామిడి రైతులకు 'అపెడా'లో నమోదు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందన్నారు. ఆసక్తి గల రైతులు ఆర్బీకే కేంద్రం లోగానీ, ఉద్యాన అధికారులనుగానీ సంప్రదించాలన్నారు.

ఎంపీడీవోకు ఘనసన్మానం

పీలేరు, ఫిబ్రవరి 8: బదిలీ అయిన పీలేరు ఎంపీడీవో డాక్టర్ మురళీ మోహన్ రెడ్డిని గురువారం మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, రాజకీయ, ప్రజా సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు షఫీ, సింగిల్ విండో అధ్యక్షుడు నారే వెంకటరమణా రెడ్డి, మాజీ అధ్యక్షుడు బీడీ నారాయణ రెడ్డి, ఎంఈవోలు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడి తప్ప ఏమీ లేదు


టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 8: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంకెల గారడి తప్ప ఏమి లేదని మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ పేర్కొన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో దొమ్మలపాటి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేసిందన్నారు. ప్రతి మంగళవారం అప్పుల కోసం ఎగచూసే పరిస్థితిలో వైసీపీ ప్రభుత్వం పడిపోయిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు భవానిప్రసాద్, ఉపాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, కత్తి లక్ష్మన్న, మేకల రెడ్డిశేఖర్, చంద్రశేఖర్, పురుషోత్తం, శ్రీనివాసులు, ప్రకాష్‌నాయుడు, రామకృష్ణ, గణేష్ పాల్గొన్నారు.

అర్హులైన ఉద్యోగుల పేరుతో ప్రొసీడింగ్స్ ఇవ్వాలి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 8: బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న అర్హులైన ఉద్యోగులకు జీతాలు ఇచ్చేలా ప్రభుత్వం ప్రొసీడింగ్స్ ఇవ్వాలని ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉత్తన్న పేర్కొన్నారు. గురువారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆనందరెడ్డికి ఈమేరకు వినతి పత్రం అందజేశారు. అర్హత లేని వారి పేర్లను జీవోలో తొలగించాలని లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీవైఎస్ అధ్యక్షు డు పునీత్, సీపీఐ మురళి, ప్రభాకర్, కిరణ్‌కుమార్, గంగరాజు, మాధవ్, నరసింహ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులు దేశరక్షణకు పాటుపడాలి

కురబల ఫిబ్రవరి 8: ఎన్‌సీసీ విద్యార్థులు దేశరక్షణకు పాటుపడాలని ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ దుంగ్రకోటి పేర్కొన్నారు. మండలంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో యువతలో సైన్యం పట్ల గురువారం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టడంతో పాటుగా దేశ రక్షణకు ముందుకు రావాలన్నారు. అనంతరం ఎన్‌సీసీకి సంబంధించి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యువరాజ్, లెఫ్టినెంట్ నవీన్‌కుమార్‌లు తదితరులు పాల్గొన్నారు.

'ఏపార్టీ గెలవాలన్నా బీజేపీ మద్దతు తప్పనిసరి'

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 8: రాష్ట్ర రాజకీయాలు పరిశీలిస్తుంటే రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా బీజేపీ మద్దతు తప్పనిసరి అని బీజేవైఎం రాష్ట్రఅధ్యక్షుడు మిట్టావంశీకృష్ణ అన్నారు. గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలు చూస్తుంటే ఏపీలో బీజేపీ ఎంత బలంగా విస్తరిస్తుందో తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర జనరల్ సెక్రటరీ నవనీతరెడ్డి, ఉపాధ్యక్షుడు లోకేష్, జిల్లా అధ్యక్షుడు వినోద్‌యాదవ్, బండి ఆనంద్, మదనపల్లె పట్టణ, రూరల్ అధ్యక్షులు జర్మనీరాజు వసంతకుమార్, అసెంబ్లీ కన్వీనర్ భగవాన్, బండిభానుప్రకాష్, సూర్యప్రకాషరెడ్డి, పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్‌ను కలిసిన దారం అనిత

మదనపల్లె, ఫిబ్రవరి 8: ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత..జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో జనసైనికులతో కలసి ఆమె, అధినేతను కలిశారు. ఈ సందర్భంగా మదనపల్లె నియోజకవర్గంలోని పార్టీ స్థితిగతులు, నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులుతో కలసి పార్టీ అభివృద్ధికి వచ్చే సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు దారం హరిప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నాయని జగదీష్, సుప్రీంహర్ష, ధరణి, తదితరులు పాల్గొన్నారు.

జీవో రాకుండానే వైసీపీ నాయకుల సంబరాలా..!

● రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్


విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 8: రాష్ట్ర మంత్రి మండలిలో బీటీ కళాశాల యూనివర్సిటీ చేసేశారంటూ జీవో రాకనే మదనపల్లె వైసీపీ నాయకులు సంబరాలు చేసుకోవడం ఎన్నికల ముందు డ్రామాలని రాజంపేట పార్లమెట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ధ్వజమెత్తారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీటీ కళాశాలను రాష్ట్ర మంత్రి మండలిలో యూనివర్సిటీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారంటూ మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ బీటీ కళాశాలలో జగన్, మిథున్ చిత్రపటాలకు పాలాభిషేకాలు నిర్వహించండం సిగ్గుగా లేదా ? అని ప్రశ్నించారు. ఎయిడెడ్ బీటీ కళాశాలను ఏడాది క్రితం 11 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భవనాలను ప్రభుత్వం పరం చేసుకున్నా నేటి వరకు దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్ కూడా జరగలేదన్నారు. ఎంపీ మిధున్‌రెడ్డి ఎన్నికల ముందు వచ్చి మదనపల్లె ప్రజలను మభ్యపెట్టేందుకు ఇలాంటి జిమ్మిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాల్లో ఎక్కడ కూడా బీటీ యూనివర్సిటీ ప్రస్తావన రాలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గండికోట గణేష్, నాదెళ్ల అరుణ్‌తేజ, రాజన్న, చిన్న రెడ్డెప్ప, ప్రణవ్‌రాయల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం

● ఓటర్ల జాబితా పరిశీలనను పకడ్బందీగా చేపట్టాలి
● టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

ములకలచెరువు, ఫిబ్రవరి: అరాచక, అవినీతి వైసీపీ ప్రభుత్వానికి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా పేర్కొన్నారు. ములకలచెరువులో గురువారం తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జి.శంకర్‌యాదవ్ ఆదేశాలతో మండల క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, పోలింగ్ బూత్ కన్వీనర్లకు ఇంటిగ్రేటెడ్, ఓటర్ లిస్టు వెరిఫికేషన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాను పకడ్బందీగా పరిశీలించి దొంగ ఓట్లు, డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారి ఓట్లు ఉంటే పోలింగ్ అధికారుల దృష్టికి తెచ్చి తొలగించే విధంగా చూడాలన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, క్లస్టర్ ఇన్‌చార్జి చెన్నకిష్టా, నేతలు కేశవులు, ముత్తుకూరు మౌలా, నాయకులు సుధాకర్‌నాయుడు, కట్టా హరినాథ్, శివన్న, మధు, రెడ్డెప్ప, బసివి చంద్ర, శంకర్‌నారాయణ, రమణారెడ్డిలతో పాటు మాజీ ఎమ్మెల్యే శంకర్ పీఏ నాగార్జున పాల్గొన్నారు.

జడ్జిగా ఎంపికైన ప్రశాంత్‌కు ఘనసన్మానం


జడ్జిగా ఎంపికైన ప్రశాంత్‌ను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాసంఘాల నేతలు

పీలేరు, ఫిబ్రవరి 8: జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ విద్యానగర్‌కు చెందిన పల్లెపాగు ప్రశాంత్‌ను గురువారం స్థానిక అధికారులు, ప్రజాసంఘాల నేతలు ఘనంగా సన్మానించారు. జడ్జీగా ఎంపికైన అనంతరం తొలిసారిగా స్వగ్రామానికి వచ్చిన ప్రశాంత్‌ను విద్యానగర్ గ్రామస్థులతోపాటు అధికారులు, ప్రజాసంఘాల నేతలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యతోనే ఎవరైనా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్న సత్యానికి ప్రశాంత్ అందరికీ ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. కార్యక్రమంలో తహసీల్దారు మహబూబ్ బాషా, ఎంపీడీవో డాక్టర్ మురళీమోహన్ రెడ్డి, ఎస్ఐ రమణయ్య, ఏపీవో మహేశ్వర, సర్పంచ్ రాజేశ్, 'బాస్' నాయకులు పాలకుంట శ్రీనివాసులు, ముల్లంగి కృష్ణయ్య, నాగరాజ, గురవయ్య, మాలమహానాడు నాయకులు తుమ్మల ధరణీ కుమార్, సుభాష్, జెట్టి మల్లిఖార్జున, ఆనంద్, బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు ఎద్దుల మహేశ్ కుమార్, అశోక్ కుమార్, గిరిజన సంఘం నాయకులు రామ్మూర్తి నాయక్, బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బోడేశావలి, ఎంఎస్‌పీ ఇన్‌చార్జ్ గండికోట వెంకటేశ్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర మాదిగ, ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసులు, ఎంఎస్‌పీ తంబళ్లపల్లె ఇన్‌చార్జ్ దుమ్ము చిన్నా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజన కాలనీలో పోలీసుల దాడులు తగవు


మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్రఉపాధ్యక్షుడు గౌతమ్ కుమార్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 8: కార్డన్ అండ్ సెర్చ్ పేరుతో మదనపల్లెలోని గాంధీపురం, ఇతర దళిత, గిరిజన కాలనీల్లో పోలీసులు దాడులు నిర్వహించడం తగదని బీఎస్పీ రాష్ట్రఉపాధ్యక్షుడు బందెలగౌతమ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాంధీపురం కాలనీలో బుధవారం పోలీసులు వచ్చి కార్డన్‌సెర్చ్ పేరుతో ఇళ్ల తలుపులు కొట్టి అక్కడ ఉన్న ద్విచక్రవాహనాలను తీసుకెళ్లడం జరిగిందన్నారు. గాంధీపురం, కుమారపురం, నక్కలదిన్నెతాండా, చంద్రకాలనీ, బాబుకాలనీల్లో కూలీలే ఎక్కువగా ఉన్నారని అక్కడ కార్డన్ సెర్చ్ చేస్తే కోట్లాది రుపాయలు డబ్బుగానీ, విదేశీ మద్యం దొరకవని అవి ఖరీదైన కాలనీలో మాత్రమే దొరుకుతాయన్నారు. .ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ కాలనీపై చిత్తశుద్ధి ఉంటే యువతకు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలు సాగించే వాళ్లకు ప్రత్యేకమైన కౌన్సెలింగ్ ఇస్తే తాము కూడా సహకరిస్తామన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో ఏమి దొరికాయే ప్రజలకు పోలీసులు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను అరెస్టు చేయడం ఆటవిక చర్య


సబ్‌కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 8: తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం అరెస్టు చేయించడం ఆటవిక చర్యే అని సీపీఎం జిల్లాకార్యదర్శి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్ వద్ద ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ చలో విజయ వాడకు వెళ్లనీయకుండా ఆశా వర్కర్లకు పోలీసులు చేత నోటీసులు ఇప్పించడం గృహ నిర్బంధాలు చేయడం నిరంకుశ పాలనను తలపిస్తోందన్నారు. వైద్యఆరోగ్యశాఖ అధికా రులు చర్చల పేరిట ఆశా వర్కర్లను పలిచి, అక్కడికి వెళ్లాక అక్రమ అరెస్టులకు పాల్ప డం అప్రజాస్వామ్యమన్నారు. ఆశా వర్కర్ల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సవిత మాట్లా డుతూ ఆశాలకు 62 ఏళ్లకు పదవతఈ విరమణ జీవో వర్తింప జేయాలన్నారు. అనతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం అంజజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు రమామణి, వసంతమ్మ, సుజాత మంజుల, మల్లీశ్వరి, విమల, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి కొండ్రెడ్డి పరామర్శ

బి.కొత్తకోట ఫిబ్రవరి 8 : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ మస్తాన్‌ను గురువారం రాష్ట్ర టీడీపీ కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి పరామర్శించారు.మదనపల్లెలో శస్త్ర చికిత్సల అనంతరం స్వగృహంలో ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా అతనికి ఆర్థిక సహాయం చేశారు. సంఘటన గురించి విచారించి త్వరగా కోలుకోని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పలువురు టీడీపీ కార్యకర్తలు ఉన్నారు.

జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటుకు తోడ్పడండి


జనసేన గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న ప్రదీప్

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 8: రాబోవు ఎన్నికల్లో జనసేన- టీడీపీ ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా గెలిపించాలని జనసేన మండల అధ్యక్షుడు ప్రదీప్ ప్రజలను కోరారు. గురువారం ఆయన దిగువపల్లిలోని ప్రజలకు జనసేన గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం సామాన్యులతో పాటు ప్రతి వర్గాన్ని దగా చేసిందన్నారు. కనీసం నిత్యావసర సరుకుల కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాన్ క్రియాశీలక సభ్యత్వం గత ఏడాది మార్చిలోనే గడువు ముగిసినా వాటి రెన్యువల్‌కు తనసొంత నిధులతో దాదావు 3.5కోట్లను ఖర్చు చేశారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జనసేన టీడీపీ పార్టీలను గెలిపించి జగన్‌కు బుద్ధిచెప్పా లన్నారు. ఈ కార్యక్రమంలో అఫ్రోజ్, భరత్, రవి, జయమ్మ పాల్గొన్నారు.